Follow: @ANNTELUGU

06-10-2026

ANN తెలుగు

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 255 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## వందకు పైగా సినిమాల్లో పాటలు రాశా

- రాయలసీమ, ఉత్తరాంధ్ర, తెలంగాణ అన్నిప్రాంతాల సాహిత్యం రాశా
- క్రేజీ కళ్యాణం మూవీ పాటల్లో ప్రయోగం చేశా
- ఎఎన్ఎన్, మహాతో ప్రముఖ కవి గోరటి వెంకన్న ఇంటర్వ్యూ

02

టాప్ న్యూస్

## సీఈసీ ఏకపక్ష నిర్ణయాలపై సుప్రీం సీరియస్



- కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ.
- ఫారం-6 సవరణల రికార్డులు సమర్పించాలని ఆదేశం.

02

## సీఈసీ తక్షణమే రాజీనామా చేయాలి



- బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు! సర్ ను రద్దు చేయాల్సిందే.
- కేంద్రం ముందు మూడు డిమాండ్లు ఉంచిన కాంగ్రెస్ చీఫ్ ఖర్గే.

02

## ప్రత్యర్థి హద్దు మీరితేనే యుద్ధం!



- రాయితీలు, రాజీ ధోరణి కష్టంగా మారడమే కారణం.
- గత ప్రభుత్వ హయాంలో ఒక్క ప్రాజెక్టూ పూర్తి కాలేదు.
- ప్రొద్దుటూరు సభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.

03



# ఫారం-7తో కుట్రలు

- బోగస్ ఫారం-7లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించిన సీఈవో సుదర్శన్‌రెడ్డి
- హైదరాబాద్ తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఓ పార్టీ స్పెషల్ డ్రైవ్
- కాంగ్రెస్ ఫిర్యాదుపై తీవ్రంగా స్పందించిన సీఈవో
- ఫారం-7, ఫారం-6లతో ప్రజాతీర్పును తారుమారుచేసే గేమ్

## అర్హులైన ఓటర్ల తొలగింపునకు వేలంవెర్రి తొండి దరఖాస్తులు

**హైదరాబాద్, మహా** : ఈసీ సర్ అర్హులను ఓటేయకుండా ప్రజాస్వామ్యాన్ని, ప్రజాతీర్పును ఖూనీ చేస్తున్నదంటూ దేశమంతా భగ్గుమంటున్న వేళ తెలంగాణలో ఫారం 7ను అడ్డుగా పెట్టుకుని చేస్తున్న కుట్రలు బయటపడ్డాయి. వీటిపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేస్థాయి నేతలు ఈ ఫిర్యాదుల కోసం తమ ఇండ్లలో స్పెషల్ టీమ్ లను ఏర్పాటుచేసుకుని వేలాదిగా ఫిర్యాదులు చేయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. హైదరాబాద్ సిటీతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి దారుణాలు జరుగుతన్నాయి. కాగా బోగస్ ఫారం 7లపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ సీఈవో సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు సీఈవో ఆదేశాలు జారీ చేశారు. అర్హులైన ఓట్ల తొలగింపు కోసం కొన్నిచోట్ల భారీగా బోగస్ ఫారం 7 ఇచ్చినట్లు సమాచారం. తప్పుడు ఫారాలు సమర్పిస్తే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్‌లో భాగంగా తెలంగాణలో అనేక ప్రాంతాల్లో ఎవరి పేర్లు తొలగించాలో పేర్కొంటూ ప్రింటెడ్ ఫారం7 పత్రాలు లభించాయి. హైదరాబాద్ పరిధిలోని ముషీరాబాద్ నియోజకవర్గంలోని పోలింగ్ బూత్ పరిధిలో పత్రాలు లభించాయని సుదర్శన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల విభాగం నేతలు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ బహదూర్ పుర నియోజకవర్గంలో ప్రింటెడ్ ఫారం 7 పత్రాలు శుక్రవారం దర్శనమిచ్చాయి. తాజాగా శనివారం గోషామహల్ నియోజకవర్గంలోనూ లభించాయి. దీంతో అసలు ఈ పత్రాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి. ఎవరు వీటిని ప్రింట్ చేస్తున్నారు. బీఎల్‌వోలకు ఎవరు ఇస్తున్నారు. ఎవరైనా ప్రణాళిక ప్రకారం చేస్తున్నారా అనే అనుమానం రాజకీయ పార్టీల్లో నెలకొంది. ఫారం 6ను వినియోగించి కొత్త ఓటరుగా

మిగతా 2వ పేజీలో



# అధికారుల మౌనం.. అక్రమార్కులకు వరం!

## శాన్వీ ప్రాపర్టీస్ నాలా ఆక్రమణలపై స్పందించని అధికార యంత్రాంగం...!

- వెంకట సాయి నగర్ వెంచర్‌పై నోరు మెదపని అధికారులు...!
- వార్తలొచ్చినా కదలని ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు...!
- నోటీసులు లేవు.. చర్యలు అంతకన్నా లేవు.. బాహాటంగానే అన్నోజీగూడలో రియల్ దందా...!
- హెచ్ఎండీఏ అనుమతులు రద్దు చేయాలంటున్న స్థానికులు...!

02

ప్రజాధనం, ప్రకృతి వనరులు అక్రమార్కుల పాలువుతుంటే.. రక్షణగా నిలవాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. అన్నోజీగూడ పరిధిలోని శాన్వీ ప్రాపర్టీస్ సాగిస్తున్న నాలా ఆక్రమణలు, వెంకట సాయి నగర్ వెంచర్ పేరిట జరుగుతున్న అక్రమ రియల్ దందాపై పత్రికల్లో, మీడియాలో కథనాలు వస్తున్నా.. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల్లో చలనం కరువైంది.. నాలాలు, తూములను కప్పివేసి ప్రకృతి స్వరూపాన్ని మార్చేస్తూ, అడ్డదారిలో హెచ్ఎండీఏ అనుమతులను పొందిన వ్యవహారంపై యంత్రాంగం మిన్నకుండిపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చట్టాన్ని తుంగలో తొక్కి, నాలాలను కబ్జా చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ 'రియల్' అక్రమాలపై అటు నోటీసులూ లేవు.. ఇటు చర్యలూ లేవని వారు మండి పడుతున్నారు.. తూములు, కాలువలు మాయమైపోతుంటే ఇరిగేషన్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది.. నిబంధనలను పాతరేసి వెంచర్లకు దారులు సుగమం చేసిన రెవెన్యూ, మున్సిపల్ యంత్రాంగానికి రియల్టర్ల నుంచి అందిన భారీ ముడుపులే వారి నోళ్లకు తాళాలు వేశాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఈ వెంచర్‌కు సంబంధించిన హెచ్ఎండీఏ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని, నాలాను కాపాడాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.








## కేంద్ర మంత్రులకు బీజేపీ షాక్

- యూపీ రాజ్యసభ ఎన్నికలకు 8 మంది అభ్యర్థుల ప్రకటన
- కేంద్ర మంత్రులు హర్దీప్ పురి, బీఎల్ వర్మలకు దక్కని అవకాశం
- అందరూ కొత్త వారే
- పదవీకాలం ముగిసిన ఏ ఒక్క ఎంపీకి మళ్లీ టికెట్ ఇవ్వని అధిష్ఠానం
- జాబితాలో ఇద్దరు మహిళలు, ముగ్గురు ఓబీసీ, ఇద్దరు ఎస్సీ అభ్యర్థులు

03




## నిర్మల్‌లో మంత్రుల పర్యటన

**గుడిసెలు లేని తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం**

- భూ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం
- అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా అధికారులు పని చేయాలి
- మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలు

07

## ఇలాగైతే అధికారంలోకి ఎలా వస్తాం?

02

- బీజేపీ పదాధికారులకు అధిష్ఠానం అక్షింతలు
- హైదరాబాద్‌లో మకాం వేస్తే జిల్లాల్లో పార్టీని నడిపేదెవరు?
- క్రియాశీల సభ్యత్వం లేకుండానే రాష్ట్ర స్థాయి పదవులా?
- మేనేజ్ చేసి పదవులు తెచ్చుకోవడం ఇకపై కుదరదు
- రాష్ట్ర పదాధికారుల సమావేశంలో సంస్థాగత నేతల ఫైర్






## సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్

03



# అధికారుల మౌనం.. అక్రమార్కులకు వరం!












**మహా, సిటీ బ్యూరో :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్, ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని అన్నోజిగూడ వెంకటసాయి నగర్‌లో శాన్వీ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టిన లేఅవుట్‌లో నాలాలు, తూముల మూసివేతపై 'మహా'లో ప్రచురితమైన కథనం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారినా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఎలాంటి చర్యలు కనిపించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సహజ నీటి ప్రవాహ మార్గాలను మూసివేసి, వాటిపై సీసీ రోడ్లు, స్లాబ్‌లు నిర్మించినట్లు ఆరోపణలు ఉన్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు ఇప్పటివరకు సమగ్రంగా పరిశీలించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.సర్వే నంబర్లు 36/పి, 37/పి, 38/పి, 40/పి పరిధిలోని లేఅవుట్‌కు సంబంధించి ఫైల్ నంబర్ 001556/హెచ్ఎండీఏ/00428/ఎస్‌డబ్ల్యూడీఎల్/జీటీకే/2025, ఎల్‌పీ నంబర్ 0174/హెచ్ఎండీఏ/ఎస్‌డబ్ల్యూడీఎల్/2025 పేరుతో అనుమతులు జారీ అయినట్లు రికార్డుల ప్రకారం స్పష్టమవుతోంది. అయితే లేఅవుట్ మధ్య నుంచి సహజ నీటి ప్రవాహ మార్గం ఉన్నట్లు స్థానికులు చేస్తున్న ఆరోపణలపై ఇప్పటివరకు సమగ్ర స్థాయిలో సర్వే నిర్వహించకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**కథనం వచ్చినా.. కదలని అధికారులు...**

నాలాలు, తూముల మూసివేత, వరద నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయన్న ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో కనీసం క్షేత్రస్థాయిలో సంయుక్త తనిఖీ నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాల్సిన అధికారులు మౌనం వహించడంపై స్థానికుల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్ఎండీఏ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహిస్తే నాలా అసలు స్థితి, నీటి ప్రవాహ మార్గం, బఫర్ పరిధి తదితర అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు అలాంటి చర్యలు చేపట్టకపోవడం వెనుక అసలు కారణమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**నాలాపై రోడ్డు.. వరదకు దారేది..?**

సహజంగా ప్రవహించే వరద నీటి మార్గాన్ని మూసివేసి దానిపై సీసీ రోడ్డు, స్లాబ్ నిర్మాణం చేపట్టినట్లయితే భారీ వర్షాల సమయంలో నీరు ఎటువైపు వెళ్తుందన్నదే ప్రధాన ఆందోళనగా మారింది. బంధం కుంట నుంచి వచ్చే వరద ప్రవాహం ఘట్‌కేసర్ ఆర్‌విఎస్ స్కూల్, జైపూర్ కాలనీ మీదుగా ప్రవహించి నారాయణ చెరువులో కలుస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ నీటి ప్రవాహ మార్గంలో ఎక్కడైనా అడ్డంకులు ఏర్పడితే దిగువ ప్రాంతాలతో పాటు ఎగువ ప్రాంతాలపైనా వరద ప్రభావం పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజల సొమ్ముతో రియల్టర్ల జేబులు నింపే కుట్ర:**

నాలాలు మూసేసి నిర్మించే ఈ అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసే సామాన్యుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేపు వర్షాలు వస్తే ముంపు సమస్యలు తలెత్తి కొనుగోలుదారులు రోడ్డున పడే పరిస్థితి దాపురిస్తుందని, వార్తలు వచ్చినా కనీసం వెంచర్ వద్దకు వెళ్లి పరిశీలించకపోవడం, బుల్డోజర్లతో ఆక్రమణలను తొలగించకపోవడం వెనుక ఏ స్థాయి అధికారుల హస్తం ఉందో తేలాల్సి ఉందని వారు పేర్కొంటున్నారు.

**అనుమతులు రద్దు చేసి..**
**నాలానుపునరుద్ధరించాలి**

చెరువులు, కుంటలు, నాలాలు, ఫీడర్ ఛానళ్ల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అన్నోజిగూడ వెంకటసాయి నగర్‌లో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లేఅవుట్ వ్యవహారంపై హైడ్రా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నాలా, తూములను మూసివేసి లేఅవుట్ అభివృద్ధి చేసినట్లు ఆరోపణలు ఉన్నందున.. అనుమతులను సమగ్రంగా పరిశీలించి, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే లేఅవుట్ అనుమతులను రద్దు చేయడంతో పాటు మూసివేసిన నాలాను తిరిగి పునరుద్ధరించాలనివారు కోరుతున్నారు.నాలాను పూర్తిగా తొలగించి ఓపెన్ డ్రెయిన్‌గా సహజ నీటి ప్రవాహం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు పేర్కొంటున్నారు. నాలాపై నిర్మించిన స్లాబ్‌లు, రోడ్లు తదితర నిర్మాణాలు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారినట్లు తేలితే వాటిని తొలగించి పూర్వస్థితిని పునరుద్ధరించాలనివారు కోరుతున్నారు. నాలా మూసివేత, సహజ నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించిన అంశాలపై ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, ఇరిగేషన్ చట్టాల ప్రకారం బాధ్యులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**అడ్డదారిలో అనుమతులిచ్చిన**
**వారిపైనా చర్యలు తీసుకోవాలి**

ఇదే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్‌కు అనుమతులు జారీ చేసినట్లు విచారణలో తేలితే హెచ్ఎండీఏకు చెందిన సంబంధిత అధికారులపైనా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. లేఅవుట్‌కు అనుమతులు ఇచ్చే ముందు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి జారీ చేసిన ఎన్‌ఓసీలు, క్షేత్రస్థాయి పరిశీలన నివేదికలు, నాలా హద్దులు, బఫర్ నిబంధనల అమలు తదితర అంశాలను హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు పారదర్శకంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. హెచ్ఎండీఏ స్థాయిలోనే పారదర్శకంగా సమగ్ర విచారణ నిర్వహించి.. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే మంజూరైన అనుమతులను రద్దు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అంతేకాకుండా నాలా మూసివేతకు సంబంధించిన వ్యవహారంలో స్థానిక మున్సిపల్ అధికారులు కూడా స్పందించి, తమ పరిధిలోని నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

***అన్ని శాఖలూ సమన్వయంతో స్పందించాలి...**

కేవలం కాగితాలపై ఉన్న అనుమతులను చూపించి వ్యవహారాన్ని ముగించకుండా.. హైడ్రా, హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్, స్థానిక మున్సిపల్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి సర్వే నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. నాలా అసలు ప్రవాహ మార్గం, వెడల్పు, హద్దులు, బఫర్ పరిధి తదితర అంశాలను అధికారికంగా నిర్ధారించి, ఆక్రమణలు లేదా నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.నాలాలను కాపాడుతామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో.. సహజ నీటి ప్రవాహ మార్గాన్నే మూసివేసినట్లు ఆరోపణలు ఉన్న ఈ వ్యవహారంలో అధికారులు ఇకనైనా కఠినంగా స్పందించాలి. లేదంటే ప్రభుత్వ లక్ష్యాలు క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతున్నాయన్నదానిపై ప్రజల్లో మరిన్ని అనుమానాలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

# ఫారం-7తో కుట్రలు

( మొదటి పేజీ తరువాయి )

నమోదు చేసుకోవచ్చు. అదే ఫారం8 ను వినియోగించి అడ్రస్‌లో మార్పులు, పేర్లలో తప్పులను సరి చేసుకొనే అవకాశం ఉంది. అయితే ఫలానా వ్యక్తి ఓటును తొలగించాలని దరఖాస్తు చేసుకోవాలంటే ఫారం7ను వినియోగించుకోవాల్సి ఉంటుంది. సంబంధిత ఓటరుపై అనుమానం కలిగినా, అది నకిలీ ఓటు లేదా డూప్లికేట్ ఓటు అని సందేహం కలిగినా, సంబంధిత ఓటరు మృతి చెందినా, వ్యక్తులు సంబంధిత చిరునామాలో లేకపోయినా ఇలా అనేక కారణాలతో ఫారం7 ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

**29 వేల దరఖాస్తులు**

ఇక్కడి లభించిన వాటిలో తొలగించాల్సిన ఓటరు వివరాలను ఫారం7లో ప్రింట్ చేసి వాటిని కట్టలుగా తెచ్చి బీఎల్‌వోలకు ఇస్తుండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవగాహన ఉన్న బీఎల్‌వోలు ఎవరూ ఇలాంటి ప్రింటెడ్ ఫారాలను తీసుకోరు. ఈ విషయం తెలియని వారు స్వీకరించి ముందుకువెళ్లే అవకాశం ఉంది. అలా జరగడంతోనే ఈ విషయం వెలుగులోకి వచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఈ తరహా ఘటనలు బయటకు వస్తుండటంతో ఎన్నికల అధికారులు దృష్టి సారించారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో జరిగిన ఘటనపై విచారణకు ఆదేశించారులో తెలంగాణలో ఇప్పటి వరకు ఫలానా వారి ఓట్లను తొలగించాలంటూ ఎన్నికల అధికారులకు దాదాపుగా 29 వేల దరఖాస్తులు అందాయి. దీంతో తప్పుడు ఫారాలు సమర్పిస్తే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఈవో ఆదేశించారు.

# సీఈసీ ఏకపక్ష నిర్ణయాలపై సుప్రీం సీరియస్

- **కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ.**
- **ఫారం-6 సవరణల రికార్డులు సమర్పించాలని ఆదేశం**

**న్యూఢిల్లీ,మహా :** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై భారత సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ఓటర్ల నమోదుకు ఉద్దేశించిన ఫారం6 సవరణలు, ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో నిబంధనలను పక్కనపెట్టారన్న ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీ) సుప్రీంకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. ఆయా నిర్ణయాలకు సంబంధించిన పూర్తి రికార్డులను తమ ముందు సమర్పించాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) నేతృత్వంలోని ధర్మాసనం ఈసీని ఆదేశించింది.సీఈసీ ఏకపక్ష నిర్ణయాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ హాజరై ధర్మాసనానికి వాదనలు వినిపించారు. నూతన చట్టం (సీఈసీ అండ్ ఈసీస్ యాక్ట్) ప్రకారం ఎన్నికల సంఘంలో ఏ నిర్ణయమైనా ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రాతిపదికన మాత్రమే తీసుకోవాల్సి ఉంటుందని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కానీ, ప్రస్తుత సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలను, అభిప్రాయాలను బుట్టదాఖలు చేసి, ఒంటరిగా నిర్ణయాలు తీసుకుని అమలు చేశారని ఆరోపించారు. చట్టప్రకారం సీఈసీ ఒంటరిగా వ్యవహరించడానికి వీల్లేదని, అందువల్ల ఆయన తీసుకున్న నిర్ణయాలను తక్షణమే రద్దు చేయాలని న్యాయవాది వికాస్ సింగ్ న్యాయస్థానాన్ని కోరారు.పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు సావధానంగా విన్న సీజేఐ ధర్మాసనం.. కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఈసీ సమర్పించే రికార్డులను తాము క్షుణ్ణంగా పరిశీలిస్తామని ఈ సందర్భంగా కోర్టు పేర్కొంది. ఒకవేళ ఫారం6లో మార్పులపై కమిషనర్ల మధ్య ఏకాభిప్రాయం, లేదా మెజారిటీ నిర్ణయం లేకుండానే ఏకపక్షంగా ముందుకు వెళ్లినట్లు నిర్ధారణ అయితే, ఆ సవరణలను పక్కనపెట్టే అవకాశం ఉంటుందని కూడా ధర్మాసనం స్పష్టం చేయడం గమనార్హం.

# వందకు పైగా సిన్మాల్లో పాటలు రాశా

**హైదరాబాద్, మహా :** నను గన్న నా తల్లి రాయల సీమ అంటూ శ్రీరాములయ్య సినిమాలో పాటలు రాసిన తాను తన సినీప్రస్థానంలో వందకు పైగా సినిమాలకు పనిచేశానని, ప్రజాసాహిత్యంలో, సిన్మాలో ఎక్కడ తన అవసరం ఉంటే అక్కడ పనిచేశానని, ప్రకృతితో పెనవేసుకున్న పదాలే సాహిత్యంగా మారాయని ప్రముఖ కవి, వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. సోమవారం ఎఎన్ఎన్‌మహా కార్యాలయానికి వచ్చిన ఆయనను సీఈవో కంది రామచంద్రారెడ్డి సత్కరించారు. శ్రీరాములయ్య, కుబుసం, ఎన్‌కౌంటర్, బతుకమ్మతో పాటు అనేక చిత్రాలకు పాటలను అందించానని, గల్లీచిన్నదే కాకుండా అనేక పాటలు ప్రజల్లోకి వెళ్ళి నిలిచిపోయాయన్నారు. ప్రజల నుండి ప్రకృతి నుండే సాహిత్యం పుట్టిందన్నారు. క్రేజీ కల్యాణం మూవీలో నిర్మాత జగన్మోహన్ రెడ్డి తన మిత్రుడు కావడం వల్ల పాటలు రాశానని, తొలిసారి రొమాంటిక్ పాటలు కూడా తనతో రాయించారని. ఈనెలాఖరులో సిన్మా రిలీజవుతుందన్నారు. ప్రజలు కోరుకుంటే, కథలు కోరుకుంటే ఇంకా సినిమాలకు సాహిత్యాన్ని అందిస్తానన్నారు. ఎఎన్ఎన్ ప్రేక్షకులకు, మహా



పత్రిక ప్రేక్షకులకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ, పాలపిట్టపై తాను అనేక అద్భుతమైన పాటలు రాశానన్నారు.

# సింగరేణి కార్మికులకు దసరా ధమాకా

- ***ఏకంగా రూ.1.10 లక్షల బోనస్!**
- ***గతేడాదితో పోలిస్తే రూ.7 వేల పెంపు.**
- ***రికార్డు బోనస్‌తో మురిసిన బొగ్గు గని ప్రాంతాలు.**

**హైదరాబాద్, మహా** : దసరా, దీపావళి పండుగల వేళ సింగరేణి కార్మికులకు కోల్ ఇండియా యాజమాన్యం తీపికబురు అందించింది. పనితీరు ఆధారిత ప్రోత్సాహక బహుమతి (పీఎల్ఆర్) కింద ఒక్కో అర్హత కలిగిన కార్మికుడికి రూ.1,10,250 చెల్లించేందుకు నిర్ణయించింది. ఇటీవల కోల్‌కతాలో జరిగిన జాతీయ స్థాయి సమావేశంలో యూనియన్ ప్రతినిధులు తొలుత రూ.1.20 లక్షల పీఎల్ఆర్ బోనస్ ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేశారు. అయితే, యాజమాన్యం ప్రతిపాదనలతో సుదీర్ఘంగా సాగిన చర్చల అనంతరం చివరకు రూ.1,10,250 చెల్లించేందుకు ఏకాభిప్రాయం కుదిరినట్లు కార్మిక సంఘాలు వెల్లడించాయి. దీపావళికి ముందే ఈ మొత్తాన్ని కార్మికుల ఖాతాల్లో జమ చేయనున్నారు. గతేడాది ఈ బోనస్ రూ.1,03,000 కాగా, ఈసారి సుమారు ఏడు శాతం (రూ.7,250) పెరుగుదల నమోదైంది. ఈ నిర్ణయంతో సింగరేణిలో నాన్‌ఎగ్జిక్యూటివ్ హోదాలో పనిచేస్తున్న సుమారు 40 వేల మందికి పైగా కార్మికులకు ప్రయోజనం చేకూరుంది. సింగరేణి కార్మికులకు భారీ బోనస్ ప్రకటించడం పట్ల కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ కార్మికులకు ముందస్తు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి వెలుగులు పంచేందుకు భూగర్భంలో పగలు, రాత్రి కష్టపడి పనిచేస్తున్న కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని ఆయన కొనియాడారు. సింగరేణి కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదని, తెలంగాణ రాష్ట్రానికి 'కొంగుబంగారం' అని, లక్షలాది కుటుంబాలకు జీవనాధారమని అభివర్ణించారు. దేశ, రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వామిగా ఉన్న సింగరేణి భవిష్యత్తు కోసం యాజమాన్యం, కార్మికులు మరింత సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఇదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. సింగరేణి సంస్థకు తెలంగాణ ప్రభుత్వం వివిధ రూపాల్లో చెల్లించాల్సిన సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లిస్తే సంస్థ ఆర్థిక పరిస్థితి మరింత బలోపేతం అవుతుందన్నారు.భవిష్యత్తు అవసరాల దృష్ట్యా బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింతగా పెంచేలా వ్యూహాత్మక ప్రణాళికలు అమలు చేయాలని సింగరేణి యాజమాన్యానికి కిషన్‌రెడ్డి సూచించారు. ఉత్పత్తి పెంపుతో పాటే కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. మరోవైపు, సాధారణ పండుగ బోనస్‌కు భిన్నంగా సంస్థ ఉత్పాదకత, ఆర్థిక ఫలితాలతో ముడిపడి ఉన్న ఈ పీఎల్ఆర్ బోనస్ రాకతో బొగ్గు గని ప్రాంతాల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. రికార్డు స్థాయి బోనస్‌తో కొత్తగూడెం, మణుగూరు, గోదావరిఖని, రామగుండం, మంచిర్యాల, భూపాలపల్లి తదితర ప్రాంతాల్లోని కార్మిక కుటుంబాల్లో ముందస్తు పండుగ వాతావరణం నెలకొంది.

# ఇలాగైతే అధికారంలోకి ఎలా వస్తాం?

**హైదరాబాద్, మహా** : తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న బీజేపీ అధిష్ఠానం.. రాష్ట్ర నేతల పనితీరుపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేసింది. క్షేత్రస్థాయిలో పనిచేయకుండా కేవలం పదవులకే పరిమితమవుతున్న పదాధికారులకు తీవ్ర అక్షింతలు వేసింది. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు అధ్యక్షతన సోమవారం జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశం నాయకుల పనితీరుపై వాడీవేడి చర్చకు వేదికైంది. ఈ సమావేశంలో పాల్గొన్న పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర సహ ఇన్‌చార్జి అభయ్ పాటిల్ నాయకుల వ్యవహారశైలిపై నిప్పులు చెరిగారు. సంస్థాగతంగా ఏమాత్రం కదలిక లేకుండా ఇలాగే వ్యవహరిస్తే రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి ఎలా వస్తుందని వారు సూటిగా ప్రశ్నించారు. నాయకులు కేవలం పదవులు అనుభవించడం కాకుండా గ్రామ, నియోజకవర్గ స్థాయిలకు వెళ్లి కార్యకర్తలతో మమేకం కావాలని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారు గట్టిగా దిశానిర్దేశం చేశారు.పార్టీలో బాధ్యతలు తీసుకునే నాయకుల తీరుపై మధుకర్, అభయ్ పాటిల్ పలు సంచలన వ్యాఖ్యలు చేశారు. కనీసం క్రియాశీల సభ్యత్వం కూడా లేని వారు ఏకంగా రాష్ట్రస్థాయి బాధ్యతల్లో కొనసాగుతుండటంపై మధుకర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పదవులు నిర్వహిస్తున్న వారు సంస్థాగతంగా ఎంతో చురుకుగా ఉండాలని స్పష్టం చేశారు. ఇక జిల్లా అధ్యక్షుల పనితీరుపై అభయ్ పాటిల్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలోని ముగ్గురు జిల్లా అధ్యక్షులు మినహా మిగిలిన వారంతా జిల్లాలను వదిలేసి హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలోనే మకాం వేస్తుండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షులే హైదరాబాద్‌లో ఉంటే ఇక జిల్లాల్లో పార్టీని ఎవరు పర్యవేక్షిస్తారని నిలదీశారు. తక్షణమే వారు జిల్లాలకు వెళ్లి ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఢిల్లీలోనో, రాష్ట్ర స్థాయిల్లోనో



లాబీయింగ్ చేసి 'మేనేజ్' చేసుకుని పదవులు తెచ్చుకునే సంస్కృతి ఇకపై కుదరదని కుండబద్దలు కొట్టారు. నాయకుల క్షేత్రస్థాయి పర్యటనలను, వారి పనితీరును ఇకపై నేరుగా తామే పర్యవేక్షిస్తామని అభయ్ పాటిల్ స్పష్టం చేశారు.

గత మున్సిపల్ ఎన్నికల సమయంలో పార్టీ నిధుల వినియోగంపై కూడా అధిష్ఠానం ఆరా తీసింది. పార్టీ నిధుల విషయంలో జవాబుదారీతనం లోపించిందని, ఎవరైనా నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలితే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని అభయ్ పాటిల్ కఠినంగా హెచ్చరించారు. అవసరమైతే అలాంటి వారిపై నేరుగా క్రిమినల్ కేసులు సైతం నమోదు చేయిస్తామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

మరోవైపు రాష్ట్రంలో రానున్న కీలక ఎన్నికల కోసం పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేసే అంశంపై కూడా ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. వచ్చే ఏడాది జరగనున్న ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్లగొండ, ఉమ్మడి రంగారెడ్డి-హైదరాబాద్-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలతో పాటు.. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉపఎన్నికపై నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. తెలంగాణ బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్, సహ ఇన్‌చార్జులుగా అభయ్ పాటిల్, రేఖా శర్మ, అలాగే సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా మధుకర్, సంయుక్త కార్యదర్శిగా దశరథ్ వాయిలయాలతో కూడిన కొత్త బృందం.. రాష్ట్రంలో బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి రానున్న ఎన్నికలకు సమాయత్తం చేయడంపై పూర్తిస్థాయిలో దృష్టికేంద్రీకరించింది.

# సీఈసీ తక్షణమే రాజీనామా చేయాలి

న్యూఢిల్లీ, మహా : దేశంలో ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ లక్ష్యంగా విపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలపై ప్రతిపక్ష పార్టీలు భగ్గుమంటున్నాయి. ఈ క్రమంలోనే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ పార్టీ తరపున మూడు కీలక డిమాండ్లను తెరపైకి తెచ్చారు. వివాదాస్పద నిర్ణయాలతో వార్తల్లో నిలిచిన సీఈసీ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, ఓటర్ల జాబితా సవరణ పేరుతో ఎన్నికల సంఘం ఏకపక్షంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని స్పష్టం చేశారు. వీటికి తోడు భవిష్యత్తులో దేశంలో జరిగే అన్ని ఎన్నికలను ఈవీఎంలతో కాకుండా కేవలం బ్యాలెట్ పేపర్ల ద్వారానే పారదర్శకంగా నిర్వహించాలన్న ప్రధాన డిమాండ్‌ను ఆయన ప్రభుత్వం ముందుంచారు.ఈ మూడు డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, 'ఇండియా' (INDIA) కూటమి భాగస్వామ్య పక్షాలు రోడ్లపైకి వచ్చి తీవ్ర స్థాయిలో పోరాడుతున్నాయని ఖర్గే తెలిపారు. ఈ ఉద్యమంలో స్వచ్ఛందంగా పాలు పంచుకుంటున్న పౌర సమాజ సభ్యులకు, యువజన సంఘాలకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనల సందర్భంగా కొందరు మహిళా జర్నలిస్టులపై జరిగిన వేధింపులను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న వ్యతిరేకతను చూసి దేశంలోని నిరంకుశ పాలకులు తీవ్ర భయాందోళనల్లో ఉన్నారని ఖర్గే విమర్శించారు.మరోవైపు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సైతం ఢిల్లీలో ఏర్పాటు




చేసిన మీడియా సమావేశంలో కేంద్ర ప్రభుత్వం, సీఈసీ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేరళలో ప్రారంభమైన ఈ 'ఎస్ఐఆర్' వ్యవహారం ఇప్పుడు దేశవ్యాప్తంగా పెను రాజకీయ దుమారంగా మారిందని, ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న అవినీతికి, అక్రమాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం తీవ్రమవుతోందని ఆయన అన్నారు. వాడవాడలా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్ ప్రజల నుంచి బలంగా వినిపిస్తోందని నారాయణ తెలిపారు. ఒకవైపు ఓట్ల చోరీకి పాల్పడుతున్న పాలకులే.. మరోవైపు యూపీఐ లావాదేవీల పేరుతో ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేస్తూ సామాన్యుల జేబుల చోరీకి సైతం తెగబడ్డారని బీజేపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. గతంలో తలెత్తిన ఓ వివాదంలో విద్యాశాఖ మంత్రి రాజీనామాతో ప్రధాని నరేంద్ర మోదీ గండం నుంచి తృటిలో బయటపడ్డారని, అయితే ఇప్పుడు ఈ సీఈసీ వ్యవహారం మాత్రం నేరుగా ప్రధాని మోదీ మెడకే ఉచ్చులా చుట్టుకునే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోందని నారాయణ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

# విద్యుత్ వినియోగదారులకు 'ట్రూఅప్' వాత

**హైదరాబాద్, మహా.** తెలంగాణలోని విద్యుత్ వినియోగదారులకు పంపిణీ సంస్థలు (డిస్కంలు) భారీ షాకిచ్చాయి. గత ఆర్థిక సంవత్సరాల్లో విద్యుత్ కొనుగోలు వ్యయం, ఆదాయ వ్యత్యాసాల కారణంగా ఏర్పడిన లోటును పూడ్చుకునేందుకు డిస్కంలు ప్రతిపాదించిన 'ట్రూఅప్' ఛార్జీల వసూలుకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) అధికారికంగా పచ్చజెండా ఊపింది. దీంతో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్), ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) పరిధిలోని గృహ, వాణిజ్య వినియోగదారులపై వేల కోట్ల రూపాయల ఆర్థిక భారం పడనుంది. తాజా నిర్ణయం ప్రకారం.. వచ్చే నవంబర్ నెల నుంచి వినియోగదారుల బిల్లుల్లో ట్రూఅప్ ఛార్జీల వడ్డన మొదలుకానుంది. నవంబర్ నెలలో వాడే విద్యుత్‌కు సంబంధించి యూనిట్‌పై 30 పైసల చొప్పున అదనంగా వసూలు చేయనుండగా, డిసెంబర్ నుంచి యూనిట్‌కు 50 పైసల చొప్పున వసూలు చేస్తారు. ఈ ప్రక్రియ ద్వారా మొత్తం రూ.7,635.22 కోట్ల మేర ఆర్థిక లోటును సర్దుబాటు చేయనున్నారు. అయితే, ఉచిత విద్యుత్ విధానం అమలులో ఉన్న వ్యవసాయ రంగానికి మాత్రం ఈ ట్రూఅప్ ఛార్జీల నుంచి ఈఆర్సీ పూర్తి మినహాయింపునిచ్చింది. వ్యవసాయ విభాగానికి సంబంధించిన రూ.2,214.99 కోట్లను ప్రభుత్వమే సబ్సిడీ రూపంలో చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ సబ్సిడీలో ఎస్పీడీసీఎల్ వాటా రూ.1,442.49 కోట్లు కాగా, ఎన్పీడీసీఎల్ వాటా రూ.772.50 కోట్లుగా నిర్ధారించారు.వ్యవసాయ రంగానికి మినహాయింపు పోగా, మిగిలిన రూ.5,420.23 కోట్ల భారాన్ని గృహ, వాణిజ్య, ఇతర కేటగిరీల వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నారు. ఇందులో ఎస్పీడీసీఎల్ పరిధిలోని వినియోగదారులపై రూ.4,222.93 కోట్లు, ఎన్పీడీసీఎల్ పరిధిలోని వారిపై రూ.1,197.30 కోట్ల భారం పడనుంది. ఈ వసూళ్ల ప్రక్రియను క్రమపద్ధతిలో అమలు చేయాలని ఈఆర్సీ సూచించింది. దీనిలో భాగంగా ఎస్పీడీసీఎల్ వినియోగదారులు 29 నెలల పాటు, ఎన్పీడీసీఎల్ వినియోగదారులు 26 నెలల పాటు ఈ అదనపు ఛార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. పారదర్శకత కోసం వినియోగదారుల బిల్లుల్లో ఈ ట్రూఅప్ మొత్తాన్ని ఇతర ఛార్జీలతో కలపకుండా, ఏ ఆర్థిక సంవత్సరానికి ఆ సంవత్సరం వివరాలను విడిగా, స్పష్టంగా ముద్రించాలని డిస్కంలను ఈఆర్సీ కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న సామాన్యులకు ఈ విద్యుత్ బిల్లుల మోత మరింత ఆందోళన కలిగిస్తోంది.



## నగరంలో డీజే టిల్లు హీరోయిన్ సందడి

**షాపింగ్ మాల్ ను ప్రారంభించిన హీరోయిన్ నేహశెట్టి**

హనుమకొండ, మహా ; హనుమకొండ నగరంలో శ్రీ వారాహిలక్ష్మి షాపింగ్ మాల్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి డీజే టిట్లు ఫేమ్ సినిమా హీరోయిన్ నేహా శెట్టి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరంతో తనకున్న అనుబంధాన్ని తన అభిమానులతో పంచుకున్నారు.

## పాలమాకుల సహకార సంఘంలో
# 8 కోట్ల కుంభకోణం

- **ఖాతాదారులకు పంగనమలు..**
- **కుంభకోణం పై విచారణ చేయవలసిన అధికారులు**
- **పాలకవర్గం ఆస్తులు అటాచ్ చేశారు.**
- **కుంభకోణంలో సీఈఓ ల పాత్రని కీలకము.....**
- **సహకార సంఘంచైర్మన్. శ్రావణ్ గౌడ్,**

**రాజేంద్రనగర్ మహా ;** ఖాతాదారులు రైతులు తమ కష్టార్జితాన్ని, పొదుపు మొత్తాలను సొసైటీ లలో దాచుకుంటే, కొందరు పాలకవర్గ సభ్యులు, సిబ్బంది స్వార్థం, మేనేజ్ మెంట్ వైఫల్యాల వల్ల కోట్ల రూపాయల కుంభకోణాలు జరిగి, చివరకు సామాన్య ప్రజలు రైతులు నష్టపోతున్నారు. శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలోని సహకార సంఘం 2013 లో కోటి 30 లక్షల పైచిలుకు నష్టలలో ఉన్న సహకార సంఘం బ్యాంకు నేడు 8 కోట్లకు పైగా కుంభకోణంలో ఉన్నట్లు అధికారులు ఇటీవల జరిగిన విచారణలు తేల్చారు. తాజాగా సోమవారం రెండు పర్యాయాలుగా గెలుపొందిన పాలకవర్గాలు కార్యాలయానికి చేరుకొని ఈ కుంభకోణంలో కీలకపాత్ర వహించిన ప్రస్తుత సీఈఓ రఘు వర్ధన్ మాజీ సీఈఓ శౌరెడ్డిలు కీలకపాత్ర పోషించారని చైర్మన్ శ్రవణ్ కుమార్ గౌడ్ , వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, పాలకవర్గం సీఈఓ లను నిలదీశారు. 2013లో కొత్తగా వచ్చిన పాలకవర్గం సభ్యులకు అప్పుడు ఉన్న నష్టాన్ని వివరించకుండా సహకార సంఘం పూర్తిగా లాభాల బాటలో నడుస్తుందని మాయా మాటలు చెబుతూ ఆనష్టం కాస్త 8 కోట్లు అయిందని చైర్మన్ ధ్వజమెత్తారు. పాలకవర్గం సభ్యులకు తెలియకుండా సీడ్స్ వ్యాపారం పేరుతో రెండున్నర కోట్ల రూపాయలు బ్యాంకుకు నష్టం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులో డబ్బులు డిపాజిట్ చేసిన ఖాతాదారులు తమ డబ్బులు తమకు ఇవ్వాలని గత ఏడాది నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్న కన్నీరు మున్నిరయ్యారు. ఖాతాదారులకు ఎలాంటి డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఖాతాదారులు ఆరోపించారు. బ్యాంకు టర్న్ అవర్ 11 కోట్లు ఉండగా అందులో మూడు కోట్లు రుణాలు ఇచ్చాము. రికవరీ చేయాలన్నారు.దాదాపు 8కోట్ల కుంభకోణం జరిగింది అందులో డిపాజిట్ దారుల డబ్బులు అధికంగా ఉన్నట్లు తెలిపారు. అధికారికంగా ఆడిట్ రిపోర్ట్ ప్రకారం ప్రస్తుత సీఈవో రఘు వర్ధన్, మాజీ సీఈఓ శెవ్ రెడ్డిల నుంచి వసూలు చేయవల్సిన డబ్బు లు అధికారులు వారిని వదిలి పెట్టి, డైరెక్టర్ల ఆస్తులను జప్తు చేయడానికి ఎలాంటి హక్కు ఉందో అధికారులు వివరించాలని డిమాండ్ చేశారు. సహకార సంఘంలో డిపాజిట్ దారులకు డబ్బులు చెల్లించకపోవడంతో డబ్బులు ఎందుకు చెల్లించడం లేదని అధికారులను అడిగితే వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో, తాను 51 కింద విచారణకు వెళ్లినట్లు తెలిపారు. విచారణలో సహకార సంఘంలో కుంభకోణం జరిగినట్లు తేలింది అన్నారు. ఇద్దరు సీఈఓ ల నుంచి రావాల్సిన మొత్తాన్ని చెల్లిస్తే సగం ఒత్తిడి తగ్గుతుందన్నారు. డైరెక్టర్ల నుండి ఏదైనా సహాయ సహకారం కావాలంటే పూర్తిగా అందిస్తామని వివరించారు.పాలకవర్గానికి తెలియకుండా సిఈఓ లు ఇస్తానుసారంగా వ్యవహరిస్తూ రైతుల డబ్బులు దోచుకున్నారు. కోట్లు కూడగట్టి ఆస్తులు సంపాదించారు. ఆ ఆస్తులను కుటుంబ సభ్యుల పేరుట మార్చారు.అక్రమాలకు పాల్పడిన బాధ్యుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా రుణాలు పొందిన వారి నుంచి సొమ్మును రికవరీ చేయడానికి ఆస్తుల జప్తు వంటి కఠిన చర్యలకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.



## ప్రత్యర్థి హద్దు మీరితేనే యుద్ధం!

**కడప,మహా** : రాయలసీమ అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న సభల్లో రాజకీయాలు మాట్లాడటం సరికాదని, ప్రత్యర్థి హద్దు మీరినప్పుడే యుద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో కలిసి ఆయన 'జల్ జీవన్ మిషన్', 'అమరజీవి జలధార' తదితర పథకాలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించారు. సభలో కార్యకర్తల ఉత్సాహాన్ని, ఆవేశాన్ని గమనించిన ఆయన.. వారి భావోద్వేగాలు తనకు అర్థమవుతున్నాయని, అయితే ఇది రాజకీయాలు మాట్లాడే వేదిక కాదని సున్నితంగా వారించారు. అవతలి వారు హద్దు మీరినప్పుడే మనం యుద్ధం చేయాల్సి ఉంటుందని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.గత వైసీపీ ఐదేళ్ల పాలనపై పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదని, కనీసం కేంద్రం ఇచ్చిన నిధులను సైతం సద్వినియోగం చేసుకోకుండా పాలకులు నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని జల్ జీవన్ మిషన్ పథకాన్ని మళ్లీ పొడిగించుకున్నామని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పూర్తి సహకారంతో రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. దీనికి నిదర్శనంగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోనే ఏకంగా రూ.6 వేల కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు.

# కేంద్ర మంత్రులకు బీజేపీ షాక్

**న్యూఢిల్లీ, మహా :** ఉత్తరప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ అనూహ్య నిర్ణయం తీసుకుంది. పదవీకాలం ముగియనున్న ఇద్దరు కేంద్ర మంత్రులతో సహా ఏ ఒక్క సిట్టింగ్ ఎంపీకి తిరిగి అవకాశం కల్పించకుండా, ఎనిమిది మంది కొత్త ముఖాలను బరిలోకి దింపింది. ముఖ్యంగా కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్ పురి, బీఎల్ వర్మలను పక్కనపెట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉత్తరప్రదేశ్ నుంచి ఖాళీ అవుతున్న 10 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న పోలింగ్ జరగనుంది. అసెంబ్లీలోని బలాబలాల ప్రకారం బీజేపీ ఎనిమిది, సమాజ్ వాదీ పార్టీ రెండు స్థానాలను గెలుచుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీ తన ఎనిమిది మంది అభ్యర్థుల జాబితాను సోమవారం విడుదల చేసింది. ధర్మపాల్ సింగ్, రాధాకాంత్ ఓఝా, ప్రకాశ్ పాల్, విద్యాసాగర్ సోన్ కర్, గోపీ కృష్ణ పాండే, ప్రియాంక సింగ్ రావత్, రామ్ ప్రతాప్ సింగ్



చౌహాన్, శ్రుతి గంగ్వార్ లను అభ్యర్థులుగా అధిష్ఠానం ప్రకటించింది.

**2027 ఎన్నికలే లక్ష్యంగా ఎంపిక**

2027లో జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీజేపీ ఈ అభ్యర్థులను ఎంపిక చేసినట్లు స్పష్టమవుతోంది. సామాజిక సమీకరణాలతో పాటు పార్టీ సంస్థాగత అనుభవానికి ఇందులో పెద్దపీట వేశారు. ఈ జాబితాలో ముగ్గురు ఓబీసీ, ఇద్దరు షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ), ముగ్గురు అగ్రవర్ణాల అభ్యర్థులు ఉన్నారు. వీరిలో ఇద్దరు మహిళలకు అవకాశం కల్పించడం విశేషం. బారాబంకి మాజీ ఎంపీ ప్రియాంక సింగ్ రావత్, ఝార్ఖండ్ గవర్నర్ సంతోష్ గంగ్వార్ కుమార్తె శ్రుతి గంగ్వార్ లను మహిళా అభ్యర్థులుగా ఎంపిక చేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్ పాల్, ప్రముఖ దళిత నేత, మాజీ ఎంపీ విద్యాసాగర్ సోన్ కర్, అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండుసార్లు పనిచేసిన రాధాకాంత్ ఓఝా వంటి వారికి ఈ జాబితాలో చోటు దక్కింది. ఈ నిర్ణయంతో పార్టీలో కింది స్థాయి నుంచి పనిచేస్తున్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు బీజేపీ సంకేతాలు పంపింది.

# అమెరికాతో వాణిజ్య చర్చల్లో పీటముడి!

- **రాయితీలు, రాజీ ధోరణి కష్టంగా మారడమే కారణం.**
- **వాణిజ్య లోటును పూడ్చుకునే పనిలో అగ్రరాజ్యం**
- **కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి**



**ఢిల్లీ, మహా** : భారత్, అమెరికా దేశాల మధ్య ఎంతో కాలంగా సాగుతున్న ప్రతిష్ఠాత్మక వాణిజ్య ఒప్పందం (ట్రేడ్ డీల్) చర్చల్లో దాదాపుగా పీటముడి పడినట్లేనని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య కొంతకాలంగా జరుగుతున్న ఈ చర్చలు ప్రస్తుతం ఒకరకంగా స్తంభించినట్లుగానే కనిపిస్తున్నాయని ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం న్యూఢిల్లీ వేదికగా జరిగిన మ్యూనిక్ లీడర్స్ మీటింగ్ లో పాల్గొన్న మంత్రి.. ఇరు దేశాల వాణిజ్య బంధం, ఒప్పందాల పురోగతిపై తనదైన శైలిలో విశ్లేషించారు. వాణిజ్య ఒప్పందం ముందుకు సాగాలంటే ఉభయ వర్గాలు పరస్పరం రాయితీలు ఇవ్వడం, కొన్ని విషయాల్లో రాజీ పడటం తప్పనిసరని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇరు దేశాలకు ఆ నిర్ణయాలు తీసుకోవడం చాలా కష్టంగా మారిందని ఆమె కుండబద్దలు కొట్టారు. దౌత్యపరంగా చర్చలైతే నిరంతరం జరుగుతున్నాయని, కానీ ఒప్పందం కుదిరేందుకు అవతలి వారికి ఇవ్వాల్సిన మినహాయింపుల విషయంలోనే ఇరు వర్గాలకు ఇబ్బందికరంగా పరిణమించిందని మంత్రి వ్యాఖ్యానించారు. రెండు దేశాలు ఏ మేరకు రాజీ ధోరణి ప్రదర్శిస్తాయన్న దానిపైనే ఈ వాణిజ్య ఒప్పంద భవితవ్యం ఆధారపడి ఉంటుందని తేల్చిచెప్పారు.

అమెరికాతో జరుగుతున్న వాణిజ్యం ఇప్పటికీ పూర్తి స్థాయిలో భారత్ కే అనుకూలంగా ఉందని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ వాణిజ్య లోటు వల్ల ఆర్థికంగా తమకే నష్టం జరుగుతోందని భావిస్తున్న అమెరికా, ఆ లోటును వీలైనంత మేర పూడ్చుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోందని ఆమె విశ్లేషించారు. రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాల కోసం జరిగే చర్చల సరళిలో కాలానుగుణంగా ఎన్నో మార్పులు వస్తున్నాయని ఆర్థిక మంత్రి వివరించారు. ఎగుమతులు, దిగుమతులపై విధించే సుంకాలు (టారిఫ్ లు) కూడా ఈ చర్చల్లో ప్రధాన భాగమేనని, ఆ నిబంధనలు ఇంకా ఉన్నప్పటికీ సుంకాల విధింపు ఒక కొత్త పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు. వాణిజ్యపరమైన ఎలాంటి సమస్యలు తలెత్తినా, సుంకాల పెంపు వంటి ఏకపక్ష నిర్ణయాల కంటే.. పరస్పర చర్చల ద్వారానే పరిష్కారం కనుక్కోవడం అత్యుత్తమ మార్గమని మంత్రి స్పష్టం చేశారు. వాణిజ్య లావాదేవీల్లో ఇరు దేశాలు సామరస్యపూర్వకంగా 'ఇచ్చిపుచ్చుకునే' విధానాలను అన్వేషించాలని ఆమె సూచించారు.

మారుతున్న ప్రపంచ భౌగోళిక ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో, వివిధ దేశాలు బహుపాక్షిక ఒప్పందాల కంటే ద్వైపాక్షిక ఒప్పందాల (బైలేటరల్ అగ్రిమెంట్స్) వైపే అధికంగా మొగ్గు చూపుతున్నాయని నిర్మలా సీతారామన్ ఒక ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. పలు దేశాలకు ఉమ్మడిగా వర్తించే ఒప్పందాల వల్ల ఆశించిన ఫలితాలు దక్కకపోవచ్చని, కేవలం రెండు దేశాల మధ్య జరిగే ఒప్పందాలే తమకు అత్యంత ప్రయోజనకరంగా ఉంటాయని మెజారిటీ దేశాలు బలంగా విశ్వసిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కోణంలోనే ఐరోపా సమాఖ్యతో (ఈయూ) భారత్ కుదుర్చుకోనున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని సైతం తాను ఒక ద్వైపాక్షిక ఒప్పందంగానే పరిగణిస్తానని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్

- **మెదడు రహస్యాలను ఛేదించిన 'ఆప్టోజెనెటిక్స్**
- **కార్ల్ డీస్సెరోత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాజెల్ లను వరించిన పురస్కారం**
- **ఆప్టోజెనెటిక్స్ అనే టెక్నిక్ ను అభివృద్ధి చేసినందుకు ఈ గౌరవం**
- **కాంతిని ఉపయోగించి మెదడులోని నరాల కణాలను నియంత్రించడం దీని ప్రత్యేకత**
- **జ్ఞాపకాలు, భావోద్వేగాలను అర్థం చేసుకోవడంలో ఈ ఆవిష్కరణ ఒక మైలురాయి**




**మహా** : ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన ప్రారంభమైంది. 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్రంలో (ఫిజియాలజీ/మెడిసిన్) ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికాకు చెందిన కార్ల్ డీస్సెరోత్ (స్టాన్ ఫర్డ్ యూనివర్సిటీ), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (హంబోల్ట్ యూనివర్సిటీ), జార్జ్ నాజెల్ (వుర్జ్ బర్గ్ యూనివర్సిటీ) ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. 'కాంతి ఆధారిత అయాన్ చానెళ్లు, ఆప్టోజెనెటిక్స్'పై వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు గాను నోబెల్ కమిటీ వారిని ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ ఆవిష్కరణ న్యూరోసైన్స్ (నాడీశాస్త్రం) రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది. మన మెదడు జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనలను ఎలా నియంత్రిస్తుందనేది ఎన్నో శతాబ్దాలుగా ఒక పెద్ద మిస్టరీ. 20వ శతాబ్దంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏయే ప్రాంతాలు ఏయే పనులను ప్రభావితం చేస్తాయో పరిశోధించడం మొదలుపెట్టారు. కానీ, అప్పటి పద్ధతులతో కచ్చితమైన కారణాలను నిర్ధారించడం సాధ్యపడలేదు. వారి వద్ద ఉన్న మెదడు చిత్రం, ఎన్నో ప్రశ్నలతో, ఖాళీలతో నిండిన ఒక చిత్తు పటంగానే మిగిలిపోయింది. అయితే, ఆప్టోజెనెటిక్స్ రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. "ఒకప్పుడు కల అనుకున్న మెదడును మ్యాపింగ్ చేసే అవకాశాన్ని ఆప్టోజెనెటిక్స్ సాకారం చేసింది" అని నోబెల్ కమిటీ ఛైర్మన్ పెర్ స్వెన్నింగ్ సన్ వ్యాఖ్యానించారు. ఈ అద్భుత ఆవిష్కరణకు పునాది వేసింది పీటర్ హెగెమాన్ జిజ్ఞాస. 'క్లామిడోమోనాస్' అనే ఒకే కణం కలిగిన నాచు (ఆల్గే) కాంతి ఉన్నవైపు ఎలా ఈదగలుగుతోందని ఆయన ఆలోచించారు. 2000ల ప్రారంభంలో, ఆయన తన సహచరుడు జార్జ్ నాజెల్ తో కలిసి ఆ నాచు కణం ఉపరితలంపై 'ఛానెల్ రోడోప్సిన్' అనే ఒక ప్రత్యేకమైన ప్రొటీన్ ను కనుగొన్నారు. దీనిపై నీలి రంగు కాంతి పడినప్పుడు, ఆ ప్రొటీన్ లో ఒక మార్గం (ఛానెల్) తెరుచుకుని, అయాన్లు కణం లోపలికి ప్రవహించి ఒక విద్యుత్ సంకేతాన్ని సృష్టిస్తాయని వారు గుర్తించారు. ఈ ప్రొటీన్ ను ఏ కణంలో ప్రవేశపెట్టినా, ఆ కణం కాంతికి స్పందించేలా మారుతుందని నిరూపించారు.ఈ పరిశోధనను కార్ల్ డీస్సెరోత్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆయన ఛానెల్ రోడోప్సిన్ జన్యువును ఎలుకల మెదడులోని నరాల కణాలలోకి ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వాటిపై నీలి కాంతిని ప్రసరింపజేసి, నరాల సంకేతాలను విజయవంతంగా ప్రేరేపించగలిగారు. 2005లో ఆయన ఈ ప్రయోగాన్ని ప్రచురించగా, రెండేళ్ల తర్వాత 2007లో బతికున్న ఎలుకల మెదడులో ఈ 'కాంతి ఆధారిత స్విచ్' పనిచేసేలా చేసి సంచలనం సృష్టించారు. ప్రస్తుతం 'ఆప్టోజెనెటిక్స్' అని పిలుస్తున్న ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా వేగంగా ప్రాచుర్యం పొందింది. దీనిని ఉపయోగించి పరిశోధకులు నిర్దిష్ట జ్ఞాపకాలు, భయం, ఆనందం వంటి భావోద్వేగాలు, ప్రవర్తనలు నియంత్రించే నాడీ వలయాలను (న్యూరల్ సర్క్యూట్స్) ఛేదిస్తున్నారు. ఇది మానసిక, నాడీ సంబంధిత వ్యాధులపై మన అవగాహనను పెంచుతోంది. వైద్య రంగంలో, దృష్టి లోపం ఉన్నవారికి తిరిగి చూపును అందించే ప్రయత్నాలలో ఈ పద్ధతిపై ప్రయోగాలు జరుగుతున్నాయి. ఆప్టోజెనెటిక్స్ ఆవిష్కరణ మన మెదడుపై ఉన్న అవగాహనను సమూలంగా మార్చేసింది. ఈ సాంకేతికత సాయంతో ప్రతిరోజూ కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తూ, మానవాళి ముందున్న అతిపెద్ద రహస్యాలలో ఒకటైన మన మెదడు పనితీరును అర్థం చేసుకోవడానికి మార్గం సుగమం చేస్తున్నాయి.

## రామప్పకు సింగరేణి మైనింగ్ తో ముప్పు లేదు

- **సమగ్ర శాస్త్రీయ అధ్యయనం తర్వాతే మైనింగ్ పై ముందుకు**
- **సింగరేణి యాజమాన్యం స్పష్టీకరణ**

**హైదరాబాద్, మహా :** ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప గుడికి సింగరేణి మైనింగ్ తో ముప్పు పొంచి ఉందని వస్తున్న వార్తలు కేవలం అపోహలు, అవాస్తవాలు మాత్రమేనని సింగరేణి యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. సింగరేణి ఆధ్వర్యంలో ములుగు జిల్లా వెంకటాపూర్ లో చేపట్టాలని తలపెట్టిన వెంకటాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు విషయంలో సమగ్రంగా శాస్త్రీయ అధ్యయనం చేసిన తర్వాతే ముందుకు వెళ్లాలని నిర్ణయించామని స్పష్టం చేసింది. ఈ విషయంలో భారత పురావస్తు శాఖ, ఇతర ప్రతిష్ఠాత్మక సంస్థలు శాస్త్రీయంగా అధ్యయనం చేసి ఇచ్చే నివేదికల ఆధారంగానే తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొంది. బాధ్యతాయుతమైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న సింగరేణి తెలంగాణకు చెందిన ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప గుడికి ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం చేకూర్చబోదని, వారసత్వ సంపద పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసింది. పర్యావరణహితమైన చట్టబద్ధమైన మైనింగ్ కార్యకలాపాలు మాత్రమే సింగరేణి అధిక ప్రాధాన్యాలు అని పునరుద్ఘాటించింది.



## సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ కు దేశ అత్యున్నత న్యాయస్థానంలో స్థానం లభించింది. ఆయనను సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్రపతి భవన్ నుంచి అధికారికంగా నోటిఫికేషన్ వెలువడింది. న్యాయ వ్యవస్థలో ఆయన సుదీర్ఘ కాలంగా అందిస్తున్న విశిష్ట సేవలు, న్యాయకోవిదుడిగా ఆయనకున్న అపార అనుభవాన్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు కొలీజియం.. ఆయన పేరును కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ కొలీజియం సిఫారసుల ఆధారంగా కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ నియామక ప్రక్రియను పూర్తి చేయగా, తాజాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులపై లాంఛనంగా ఆమోదముద్ర వేశారు.జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఎన్నో కీలకమైన కేసుల్లో చారిత్రాత్మక తీర్పులు వెలువరించారు. న్యాయస్థానాల పనితీరును మెరుగుపరచడంతో పాటు, సామాన్యులకు సత్వర న్యాయం అందేలా పలు పరిపాలనాపరమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. న్యాయ ప్రక్రియను వేగవంతం చేయడంలో ఆయన తీసుకున్న చొరవ సర్వత్రా ప్రశంసలు అందుకుంది. ఈ పదోన్నతితో ఢిల్లీ వెళ్లనున్న ఆయన, త్వరలోనే సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా లాంఛనంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

**యాక్టింగ్ సీజేగా జస్టిస్ సామ్ కోషీ..**

మరోవైపు, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టుకు పదోన్నతిపై వెళ్తుండటంతో ఖాళీ అయిన తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో తాత్కాలిక సీజే (యాక్టింగ్ చీఫ్ జస్టిస్)గా జస్టిస్ సామ్ కోషీ వ్యవహరించనున్నారు. హైకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న ఆయనకు ఈ బాధ్యతలు అప్పగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. తదుపరి పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తి నియామకం జరిగే వరకు జస్టిస్ సామ్ కోషీ ఈ పదవిలో కొనసాగనున్నారు. జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టుకు ఎంపికవడం పట్ల తెలంగాణ న్యాయవాద సంఘాలు, బార్ కౌన్సిల్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## లంచం ఆరోపణలపై ముగ్గురు పోలీసులకు బదిలీ

- **తిమ్మాపూర్ సీఐ, ఎల్ఎండీ ఎస్సై, కానిస్టేబుల్ హెడ్ క్వార్టర్స్ కు అటాచ్**
- **వాహనం వ్యవహారంలో డబ్బుల డిమాండ్ చేశారనే ఆరోపణలు**

కరీంనగర్ మహా: పోలీస్ శాఖలో లంచం ఆరోపణలు కలకలం రేపాయి. తిమ్మాపూర్ సీఐ, ఎల్ఎండీ ఎస్సైతో పాటు ఓ కానిస్టేబుల్ పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో జిల్లా ఎస్పీ చర్యలు చేపట్టారు. ముగ్గురినీ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ కు అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఓ వాహనాన్ని విడిచిపెట్టే విషయంలో డబ్బులు డిమాండ్ చేశారనే ఆరోపణలు పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. దీనిపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం సంబంధిత సిబ్బందిపై బదిలీ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. తిమ్మాపూర్ సీఐ రమేశ్, ఎల్ఎండీ ఎస్సై అన్వర్ తో పాటు సంబంధిత కానిస్టేబుల్ ను జిల్లా హెడ్ క్వార్టర్స్ కు అటాచ్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై శాఖాపరమైన విచారణ జరిగే అవకాశం ఉంది. ఆరోపణల్లో వాస్తవాలు, సంబంధిత సిబ్బంది పాత్రపై విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకునే



అవకాశముంది. ఒకే వ్యవహారానికి సంబంధించి ముగ్గురు పోలీసు సిబ్బందిపై బదిలీ వేటు పడటం పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## అంగన్వాడీ టీచర్ల భర్తీ ప్రక్రియ సత్వరమే పూర్తి చేయాలి

**పారదర్శకంగా ఎంపిక చేపట్టాలి**
**అర్హుల, అనర్హుల జాబితాను గ్రామపంచాయతీల్లో ప్రదర్శించాలి**

కరీంనగర్ మహా: జిల్లాలో అంగన్వాడీ టీచర్ల భర్తీ ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. భర్తీ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా ఎంపిక చేపట్టాలని సూచించారు. కరీంనగర్ జిల్లాలో ఇటీవల అంగన్వాడీ టీచర్ల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సోమవారం రాత్రి జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, సీడీపీవోలతో భర్తీకి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 60 అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతించగా, మొత్తం 2,167 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు.

**దరఖాస్తుల పరిశీలనలో జాగ్రత్తలు**

భర్తీకి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థుల అర్హతలు, సమర్పించిన ధ్రువపత్రాలు, ఇతర వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి ఎలాంటి తప్పిదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కొనసాగించాలని స్పష్టం చేశారు.



ANN తెలుగు
మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్
06-10-2026

మహా ప్రత్యేకం



# కాంతిరేఖలతో నాడీకణాలను శాసిస్తూ

## వైద్య నోబెల్ సాధించిన ముగ్గురు శాస్త్రవేత్తలు

మెదడు చీకటి కోణాల్లో కాంతి కిరణాలు ప్రసరింపజేసి, నరాల కణాల రహస్యాలను ఛేదించిన ఆప్టోజెనెటిక్స్ పితామహులకు ప్రతిష్ఠాత్మక పురస్కారం వరించింది. జీవకణాల్లో అయాన్ ఛానెళ్లను కాంతి ద్వారా నియంత్రించే విప్లవాత్మక ఆవిష్కరణకు గాను అమెరికాకు చెందిన కార్ల్ డిసెరోథ్, జర్మనీకి చెందిన పీటర్ హెగెమన్, జార్జ్ నగెల్‌లను 2026 వైద్యశాస్త్ర నోబెల్ కమిటీ సంయుక్తంగా ఎంపిక చేసింది. చిన్న ఆల్గీ నుంచి ప్రారంభమైన ఈ శాస్త్రీయ ప్రయోగం, నేడు న్యూరోసైన్స్ రంగంలో మెదడు జబ్బులకు, మానసిక రుగ్మతలకు సరికొత్త చికిత్స మార్గాలను అన్వేషిస్తోంది.  ఆప్టోజెనెటిక్స్ రంగంలో చేసిన పరిశోధనలకు గాను అమెరికాకు చెందిన కార్ల్ డిసెరోథ్, జర్మనీకి చెందిన పీటర్ హెగెమన్, జార్జ్ నగెల్‌లను నోబెల్ కమిటీ సోమవారం విజేతలుగా ప్రకటించింది. స్టాక్‌హోమ్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్‌లో ఆ ప్రకటన వెలువడింది.





### అసలు ఆప్టోజెనెటిక్స్ అంటే?

సింపుల్‌గా చెప్పాలంటే, కాంతిని ఉపయోగించి నాడీకణాల పనితీరును నియంత్రించే టెక్నిక్‌నే ఆప్టోజెనెటిక్స్ అంటారు. మన మెదడులో కోట్లాది నాడీకణాలు ఒకదానితో ఒకటి సంకేతాలను పంపించుకుంటూ పనిచేస్తుంటాయి. ఏ నాడీకణం ఏ పని చేస్తుంది? దాన్ని యాక్టివ్ చేస్తే ఏం జరుగుతుంది? దాన్ని ఆపితే ఏ మార్పు వస్తుంది? అనే విషయాలను తెలుసుకోవడం ఇంతకుముందు అంత సులభం కాదు. గతంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏ ప్రాంతం ఏ పనికి సంబంధించిందో గుర్తించేందుకు ప్రయత్నించారు. కానీ ఒక నిర్దిష్ట నాడీకణం కారణంగానే ఒక జ్ఞాపకం, భావన లేదా ప్రవర్తన ఏర్పడుతోందని కచ్చితంగా నిరూపించడం కష్టంగా ఉండేది. మెదడుకు ఒక మ్యాప్ వేసినట్టే సమాచారం ఉండేది. కానీ అందులో చాలా ప్రశ్నార్థకాలు ఉండేవి. ఆ పరిస్థితిని మార్చడంలో ముగ్గురి పరిశోధనలు కీలకంగా మారాయి.

### చిన్న ఆల్గీ నుంచి పెద్ద ఆవిష్కరణ

మొదటి కీలక అడుగు పీటర్ హెగెమన్ పరిశోధనలతో పడింది. చామీడొమానస్ అనే ఒకే కణం కలిగిన చిన్న ఆల్గీపై ఆయన ఆసక్తి చూపారు. ఆ జీవి కాంతి వైపు ఎలా కదులుతుందనే ప్రశ్న ఆయనను పరిశోధన వైపు నడిపించింది. ఆ తర్వాత జార్జ్ నగెల్‌తో కలిసి హెగెమన్ చేసిన పరిశోధనల్లో చానల్‌రోడాప్సిన్ అనే ప్రత్యేక ప్రొటీన్ గుర్తించారు. ఇది ఆ ఆల్గీ కణం ఉపరితలంలో ఉంటుంది. దానిపై నీలి కాంతి పడినప్పుడు ప్రొటీన్‌లోని ఒక మార్గం తెరుచుకుంటుంది. దీంతో విద్యుత్ ఛార్జ్ కలిగిన అయాన్లు కణంలోకి ప్రవేశిస్తాయి. ఫలితంగా విద్యుత్ సంకేతం ఏర్పడుతుంది. ఇక్కడే అసలు ఆసక్తికరమైన విషయం బయటపడింది. ఆ ప్రొటీన్‌ను వేరే కణాల్లోకి ప్రవేశపెట్టినా, ఆ కణాలను కాంతికి స్పందించేలా చేయవచ్చని శాస్త్రవేత్తలు గుర్తించారు.



### నాడీకణాలకు లైట్ స్విచ్

ఆ ఆవిష్కరణను నాడీకణాలపై ఉపయోగించే దిశగా కార్ల్ డిసెరోథ్ కీలక అడుగు వేశారు. ఎలుకల నాడీకణాల్లో చానల్‌రోడాప్సిన్ కోసం అవసరమైన జన్యువును ప్రవేశపెట్టారు. ఆ తర్వాత నీలి కాంతిని ఉపయోగించి ఆ నాడీకణాలను యాక్టివేట్ చేయగలిగారు. 2005లో ఆయన ఈ పరిశోధనను ప్రచురించారు. 2007లో మరో కీలక ముందడుగు వేశారు. జీవించి ఉన్న ఎలుక మెదడులోనే కాంతిని ఉపయోగించి నాడీకణాలను నియంత్రించగలిగారు. అక్కడి నుంచి ఆప్టోజెనెటిక్స్ ప్రపంచవ్యాప్తంగా న్యూరోసైన్స్ పరిశోధనల్లో కీలకమైన పద్ధతిగా మారింది.

### మెదడు రహస్యాలను తెలుసుకునేందుకు

ఆ టెక్నిక్‌తో మెదడులోని నిర్దిష్ట నాడీకణాలను యాక్టివేట్ చేయడం లేదా వాటి కార్యకలాపాలను తగ్గించడం సాధ్యమైంది. దీంతో కొన్ని ప్రత్యేక జ్ఞాపకాలు, భావోద్వేగాలు, ప్రవర్తనల వెనుక పనిచేసే నాడీ సర్క్యూట్లను పరిశోధకులు మరింత స్పష్టంగా అధ్యయనం చేస్తున్నారు. ముఖ్యంగా నాడీ సంబంధిత, మానసిక సమస్యలకు సంబంధించిన మెదడు సర్క్యూట్లను అర్థం చేసుకోవడంలో ఇది ఉపయోగపడుతోంది. అంతేకాదు, చూపు కోల్పోయిన వారికి దృష్టిని తిరిగి అందించే ప్రయత్నాల్లోనూ ఆప్టోజెనెటిక్స్‌ను ఉపయోగించే పరిశోధనలు జరుగుతున్నాయి. నోబెల్ కమిటీ ప్రకారం, ఈ పద్ధతి ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రయోగశాలల్లో మెదడు రహస్యాలను తెలుసుకునేందుకు ఉపయోగపడుతోంది.

### అంధకారంలో ఉన్న జీవితాలలో వెలుగులు

కార్ల్ డిసెరోథ్ అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో పనిచేస్తున్నారు. పీటర్ హెగెమన్ జర్మనీలోని హంబోల్ట్ యూనివర్సిటీకి చెందినవారు. జార్జ్ నగెల్ కూడా జర్మనీలోని వుర్జ్‌బర్గ్ యూనివర్సిటీలో పరిశోధనలు చేస్తున్నారు. ఆ ముగ్గురూ కలిసి అందుకున్న 2026 వైద్యశాస్త్ర నోబెల్ పురస్కారం నగదు 12 మిలియన్ స్వీడిష్ క్రోనర్. ఆ మొత్తాన్ని ముగ్గురూ సమానంగా పంచుకోనున్నారు. గతేడాది వైద్యశాస్త్ర నోబెల్ మానవ రోగ నిరోధక వ్యవస్థపై కీలక పరిశోధనలు చేసిన మేరీ ఈ. బ్రంకో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమోన్ సకగుచిలకు దక్కింది. ఇక 2026 నోబెల్ ప్రకటనల్లో భాగంగా మంగళవారం భౌతికశాస్త్రం, బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్య పురస్కారాలను ప్రకటించనున్నారు. శుక్రవారం శాంతి నోబెల్, అక్టోబర్ 12న ఆర్థికశాస్త్రంలో నోబెల్ విజేతలను వెల్లడించనున్నారు.

నాడీ విజ్ఞాన శాస్త్రంలో సరికొత్త శకానికి నాంది పలికిన ఆప్టోజెనెటిక్స్ ఆవిష్కరణ, మానవాళికి ఒక అద్భుతమైన కానుక. సూక్ష్మ జీవుల నుంచి పుట్టిన ఈ విప్లవాత్మక ఆలోచన, రేపు మెదడు రుగ్మతలను తరిమికొట్టడంలోనూ, అంధకారంలో ఉన్న జీవితాల్లో వెలుగులు నింపడంలోనూ కీలక కాంతిరేఖ కానుంది.








# సింగరేణిలో ఆయిల్ పామ్ తోటల పెంపకం

- మందమర్రి ఏరియాలో వినూత్న హరిత అడుగులు

**మందమర్రి, మహా** : 135 ఏళ్ల సింగరేణి చరిత్రలోనే తొలిసారిగా బొగ్గు తవ్వకాలు పూర్తయిన భూముల్లో ఆయిల్ పామ్ తోటల పెంపకానికి సింగరేణి యాజమాన్యం శ్రీకారం చుట్టింది. సింగరేణి సీ.అండ్.ఎమ్‌డి డాక్టర్ బుధ ప్రకాష్ జ్యోతి ఆలోచన మేరకు, డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కె వెంకటేశ్వర్లు, జిఎం ఎన్విరాన్మెంట్ ,ఫారెస్ట్ బి సైదులు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మందమర్రి ఏరియా జీఎం ఎన్ రాధాకృష్ణ నేతృత్వంలో మూసివేసిన కెకె2 భూగర్భ గని ఆవరణలో ఈ తోటల పెంపకాన్ని సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. మందమర్రి ఏరియా నర్సరీ వెనుక భాగంలో సుమారు 2 హెక్టార్ల విస్తీర్ణంలో 285 ఆయిల్ పామ్ మొక్కలతో ఈ తోటను ఏర్పాటు చేశారు. బొగ్గు గనుల భూముల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టడం సింగరేణి చరిత్రలో ఇదే ప్రథమం కావడం విశేషం. ఈ కార్యక్రమంలో జిఎం ఎన్ రాధాకృష్ణ, సేవా సమితి అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ, జిఎం ఎస్.ఓ. జి.ఎల్.ప్రసాద్, శాంతిఖని ఏజెంట్ ఎస్. సంతోష్, కెకె గ్రూప్స్ ఏజెంట్ ఖాదిర్, కెకెఓసి పిఓ డి. రాంబాబు, బెల్లంపల్లి రీజియన్ డిజిఎం (అటవీ) హరి నారాయణ, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సభ్యులు పాల్గొని మొక్కలు నాటారు. బొగ్గు ఉత్పత్తితో పాటు ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో సింగరేణి ఎల్లప్పుడూ ముందుంటుందని, ఈ ప్రాజెక్టు భవిష్యత్తులో ఇతర గనులకు ఆదర్శంగా నిలుస్తుందని జీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

# పేద ప్రజల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత: ఎమ్మెల్యే

- సంక్షేమానికి స్మార్ట్ అడుగు.. ప్రజలకు మరింత భరోసా!
- ప్రజలకు మరింత సులభంగా ప్రభుత్వ సేవలు అందేలా స్మార్ట్ విధానం
- బిఆర్ఎస్ 10 సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు....
- నేటి ప్రజా పాలనలో అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కృషి



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 5 మహా**: స్మార్ట్ రేషన్ కార్డులతో పేద ప్రజలకు మరింత లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం కేంద్రంలోని శాస్త గార్డెన్ లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపణి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ... స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత పారదర్శకంగా, సులభంగా అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది అన్నారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు.

ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు.. ఇప్పుడు గప్పాలు...

గత బిఆర్ఎస్ పాలనలో 10 సంవత్సరాల కాలంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేని వాళ్లు కూడా ఇప్పుడు గప్పాలు కొడుతున్నారని ఆయన మండిపడ్డారు. నేటి ప్రజా పాలనలో అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేయడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ప్రజలకు మరింత సులభంగా ప్రభుత్వ సేవలు అందేలా స్మార్ట్ విధానం తీసుకురావడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కృషి కృషి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, ఆర్డీవో వై శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మార్వో సునీత, కౌన్సిలర్లు నీళ్ల భాను గౌడ్, దారు రాఘవేందర్, ఇందూరి శ్రీనివాస్, వత్య రామదాసు, దొంతరమోని భార్గవి రాజు, ఇబ్రహీంపట్నం మండలం, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావణమోని లింగం, మహమ్మద్ గౌస్ పాషా, ఆదిభట్ల, కొంగర డివిజన్ అధ్యక్షులు పల్లె రజనీకాంత్ గౌడ్, చెనమోని రమేష్ ముదిరాజ్, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, రేషన్ కార్డ్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## భూ సమస్య పరిష్కరించాలని ప్రజావాణిలో ఫిర్యాదు

### రైతు కొత్త వెంకటేశం వినతి

**వలిగొండ, అక్టోబర్ 5 మహా న్యూస్:** మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు కొత్త వెంకటేశం తన భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవో నోడల్ అధికారి జలంధర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 115/ఆ3లో తనకు ఉన్న భూమికి సంబంధించిన సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన ఎంపీడీవో, నోడల్ అధికారి జలంధర్ రెడ్డి సమస్యను పరిశీలించి పరిష్కరించేలా సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు.



# అంగన్‌వాడీ టీచర్లు జాతి నిర్మాతలు

- బిజెపి గర్మిళ్ల జోన్ అధ్యక్షులు అమిరిశెట్టి రాజ్ కుమార్

**మంచిర్యాల, మహా** : ఒక వ్యక్తి ఇంజనీర్‌గా, డాక్టర్‌గా, సైంటిస్ట్‌గా, కలెక్టర్‌గా ఎదగాలంటే పునాది అంగన్వాడీ లేనని, ఆ అంగన్వాడి టీచర్లే జాతి నిర్మాతలని బీజెపి గర్మిళ్ల జోన్ అధ్యక్షులు అమిరిశెట్టి రాజ్ కుమార్ అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ గర్మిళ్ల జోన్ పరిధిలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ చిన్నారులకు ప్రీస్కూల్ విద్య, ఆటపాటలతో బుద్ధి వికాసం కలిగించడంతో పాటు గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం, గుడ్లు, పాలు అందిస్తూ అంగన్వాడీలు చేస్తున్న సేవలు ఆయన కొనియాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అంగన్వాడిలను పోషణ్ అభియాన్‌లో భాగం చేసి, వారికి ఇన్సూరెన్స్, స్మార్ట్‌ఫోన్లు అందించిందని తెలిపారు. తక్కువ వేతనం ఉన్నప్పటికీ అంగన్వాడీలు ఎన్నో రకాల సేవలందిస్తున్నారని, తెలంగాణ ప్రభుత్వం వెంటనే వారి వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా గర్మిళ్ల జోన్ అధ్యక్షులు ముల్కల కుమార్, నరేందర్, రజిత, శ్రావణి, పద్మ తదితర బీజెపి నాయకులు, మహిళా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

# దళిత మహిళపై దాడి ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేయాలి



- బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి..
- జిల్లా కార్యదర్శి జోగు శంకర్

**చింతపల్లి అక్టోబర్ 5 మహా:** చింతపల్లి మండలంలో మహిళా సంఘాలకు సంబంధించిన లెక్కలు చూసే ఒక దళిత మహిళపై కొంతమంది వ్యక్తులు దాడికి పాల్పడ్డారంటూ వచ్చిన ఫిర్యాదు, ఆరోపణలపై డిబిఎస్ఏ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జోగు శంకర్ స్పందించారు. బాధితురాలి వాదన ప్రకారం తనపై దాడి జరిగిందని, ఈ ఘటనకు సంబంధించి కొంతమంది వ్యక్తులపై ఆమె ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోందని జోగు శంకర్ పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై పోలీసులు నిష్పక్షపాతంగా, సమగ్రంగా దర్యాప్తు చేసి వాస్తవాలను నిర్ధారించాలని ఆయన కోరారు. ఈ ఘటనకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు ప్రస్తుతం అందుబాటులో లేరని, వారిపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతున్నట్లయితే చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన కోరారు. చింతపల్లి ఎస్సై రామ్మూర్తి ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి, బాధితురాలి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి, వాస్తవాలు తేలిన అనంతరం చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జోగు శంకర్ విజ్ఞప్తి చేశారు. బాధితురాలికి ఎలాంటి భయాందోళనలు లేకుండా అవసరమైన రక్షణ కల్పించాలని, ఘటనకు సంబంధించిన సాక్ష్యాలు వాంగ్మూలాలను పూర్తిగా పరిశీలించాలని ఆయన కోరారు. "దళిత మహిళకు న్యాయం జరిగేలా పోలీసులు పారదర్శకంగా వ్యవహరించాలి. ఆరోపణలు నిజమని దర్యాప్తులో తేలితే బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో దర్యాప్తు పూర్తయ్యే వరకు ఎవరి గురించి ముందస్తు నిర్ణయాలకు రాకుండా చట్టపరమైన ప్రక్రియను గౌరవించాలి" అని జోగు శంకర్ పేర్కొన్నారు.



# ప్రజావాణిలో పెట్రోల్ పోసుకున్న పిటిషనర్

- ఘటన పై పిటిషనర్ వాగ్మూలం తీసుకున్న జిల్లా కలెక్టర్
- సమస్య ఏదైనా పరిష్కారం ఉంటుంది, తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, కలెక్టరేట్ మహా** : వరంగల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమంలో పిటిషన్ సమర్పించిన దుగ్గొండి మండలం పోనకల్ గ్రామానికి చెందిన గట్ల సురేందర్, తండ్రి మంకయ్య, సోమవారం ఆవేదనతో పెట్రోల్ పోసుకున్న ఘటన చోటుచేసుకుంది. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిటిషనర్ తో మాట్లాడి వివరాలను తెలుసుకుని, ఆయన నుంచి స్వయంగా వాగ్మూలాన్ని నమోదు చేయించారు. గట్ల సురేందర్ తన సమస్యకు సంబంధించి 6 7 2026న ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. దీనిపై జిల్లా కలెక్టర్ 22 8 2026 తేదీ న జిల్లా కలెక్టరేట్ లో విచారణ (హియరింగ్) నిర్వహించారు. ఈ విచారణకు పిటిషనర్ తమ్ముడు గట్ల రాజు హాజరయ్యారు. విచారణ సందర్భంగా సంబంధిత అంశం పై నర్సంపేట సివిల్ జడ్జి కోర్టులో కేసు నంబర్ 199/224 పెండింగ్ లో ఉన్నందున, కోర్టు తీర్పు వెలువడిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని 30.09.2026న ఎండార్స్‌మెంట్ ద్వారా పిటిషనర్ కు తెలియజేశారు. అయినప్పటికీ, సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో గట్ల సురేందర్ ఆవేదనకు గురై పెట్రోల్ పోసుకున్నాడు. అనంతరం తన చర్య పట్ల పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ, ఇలాంటి పొరపాటును ఇకపై పునరావృతం చేయనని, తనను దయతో క్షమించాలని కోరుతూ స్వయంగా వాగ్మూలం రాసి జిల్లా అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, సమస్య ఏదైనా పరిష్కారం ఉంటుంది. ఎలాంటి పరిస్థితుల్లోనూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సమస్యకు సంబంధించిన అంశం కోర్టు పరిధిలో ఉన్నందున, కోర్టు తీర్పు వెలువడే వరకు సమన్వయం పాటించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆశ్రయించాలని, ఆవేశంలో ఎలాంటి ప్రమాదకర నిర్ణయాలు తీసుకోవద్దని కలెక్టర్ సూచించారు.



# పోల్కంపల్లిలో 50 లక్షలతో సీసీ రోడ్ల ప్రారంభం

- "అభివృద్ధికి బాటలు.. సమస్యలకు పరిష్కారాలు!"
- ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి తక్షణ స్పందన
- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 5 మహా**: పోల్కంపల్లి గ్రామంలో 50 లక్షలతో నిర్మించి సిసి రోడ్లని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. పోల్కంపల్లి అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి దృష్టికీ గ్రామస్తులు తమ సమస్యలు తీసుకెళ్లారు. ఈ మేరకు అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ప్రత్యేకంగా సమావేశాలు అవసరం లేదని, ప్రజల మధ్యకు వచ్చినప్పుడే సమస్యలను విని అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రజా పాలనకు నిదర్శనం అని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సొంత గూటికి పోలినేని సంపత్‌రావు

**బీఆర్ఎస్‌లో చేరిక** : కుషాయిగూడ, మహా : ఉప్పల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లోకి పలువురు నాయకుల చేరిక కొనసాగుతోంది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు పోలినేని సంపత్‌రావు తిరిగి సొంత గూటికి చేరారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంపత్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులకు అండగా నిలిచిన పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. ఉద్యమకారుల సంక్షేమం, గౌరవం కోసం గతంలో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణ సాధన ఉద్యమంలో తమ వంతు పాత్ర పోషించిన ఉద్యమకారుల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పార్టీతో అనుబంధం ఉన్న నాయకులు, ఉద్యమకారులు తిరిగి బీఆర్ఎస్ కుటుంబంలోకి రావడం సంతోషకరమన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలు, ఉద్యమకారులకు తగిన గౌరవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గంధం నాగేశ్వర్‌రావు, పాల్గొన్నారు.



# ఘనంగా గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి వేడుకలు

**పెద్దపల్లి మహా** : పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలో మాజీ కేంద్ర మంత్రి, పెద్దపల్లి మాజీ ఎంపీ, దివంగత గడ్డం వెంకటస్వామి (కాకా) 96వ జయంతి వేడుకలను కాల్వ శ్రీరాంపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి, తెలంగాణ ప్రాంతానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ప్రజా సంక్షేమం కోసం గడ్డం వెంకటస్వామి చేసిన కృషి, పేదలు మరియు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని ఉద్యోగులు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు.

# ప్రగతి పదంలో... జవహర్ నగర్ కాలనీలు.

- కాలనీల అభివృద్ధే దేశాభివృద్ధి
- మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్.

**జవహర్ నగర్, మహా** : కాలనీల అభివృద్ధే దేశాభివృద్ధి అని, కాలనీలు అభివృద్ధి చెందితేనే ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, తద్వారా ఊరు, చివరికి దేశాలే అభివృద్ధి చెందుతాయని జవహర్ నగర్ మాజీ మేయర్ శాంతి కొటేష్ గౌడ్ పేర్కొన్నారు. బజరంగ్ కాలనీలో 34 లక్షల రూపాయలతో 430 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ మేయర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పదంలో జవహర్ నగర్ కాలనీలు దూసుకెళ్తున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చెందడం ముదావహమన్నారు. జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ సహకారంతో జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకుల సహకారంతో జవహర్ నగర్ సర్వతో ముకాభివృద్ధిని సాధిస్తున్నట్లు తెలిపారు.



ఈ కార్యక్రమంలో నాయకులు బల్లి శ్రీనివాస్ గుప్తా, మాజీ కోఆప్షన్ సభ్యులు శ్వేతా ముఖేష్, శోభా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మనోధర్ రెడ్డి, బజరంగ్ కాలనీ అధ్యక్షులు ఇంద్రసేనారావు, రాజేష్, గడ్డం శ్రీనివాస్, ఉపేందర్, బాలరాజ్, నరేష్, కృష్ణ, సుబ్బారావులతో పాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# బి.ఎన్. రెడ్డి నగర్‌లో ఇళ్ల నిర్మాణ అనుమతుల సమస్య పరిష్కరించాలి

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, మహా** : చర్లపల్లి: డివిజన్ పరిధిలోని బి.ఎన్. రెడ్డి నగర్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇళ్ల నిర్మాణ అనుమతుల సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు బి.ఎన్. రెడ్డి నగర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కాలనీవాసులతో కలిసి మల్కాజిగిరి మహానగర పాలక సంస్థ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో అనేక సంవత్సరాలుగా నివసిస్తున్న మధ్యతరగతి, సామాన్య కుటుంబాలు తమ సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం, పునర్నిర్మాణం, మరమ్మతులు చేపట్టేందుకు అనుమతులు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్యను సమగ్రంగా పరిశీలించి, ఇళ్ల నిర్మాణ అనుమతులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# కూలీలకు పనులేవీ..? వెంటనే ఉపాధి కల్పించాలి

- పని కోరిన ప్రతి కుటుంబానికి 150 రోజులు కల్పించాలి: జాజిరి శ్రీనివాస్
- సత్తుపల్లి, అక్టోబరు 5: మహా

వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కరువై పేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ అన్నారు. పని కోరిన ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పథకం కింద వెంటనే పనులు కల్పించి ఆర్థిక భరోసా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సత్తుపల్లి మండలం రామనగరంలో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కస్తూరి మాధవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద పని కోరిన ప్రతి కుటుంబానికి 150 రోజుల ఉపాధి కల్పించాల్సి ఉన్నప్పటికీ, పలు గ్రామాల్లో తగిన స్థాయిలో పనులు అందక కూలీలు అప్పులు చేసి జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రతి గ్రామంలో వెంటనే గ్రామసభలు నిర్వహించి పని అవసరమైన కూలీల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. చెరువుల పూడికతీత, కాలువల శుభ్రత, పొదల తొలగింపు, గ్రామీణ రహదారుల అభివృద్ధి, నీటి సంరక్షణ వంటి పనులను ప్రారంభించాలని సూచించారు. కూలీలకు వేతనాలు సకాలంలో చెల్లించడంతోపాటు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కొత్త జాబ్‌కార్డులు అందించాలని, ఉపాధి హామీ పథకాన్ని సమర్థంగా అమలు చేసి గ్రామీణ పేదలకు నిరంతర ఉపాధి కల్పించాలని జాజిరి శ్రీనివాస్ కోరారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షురాలు పిల్లి నాగమణి, మండల కమిటీ సభ్యులు ఐనంపూడి సనందరావు, పోనుపోకు సామ్రాజ్యం, దండు లక్ష్మి, పలగాని కృష్ణవేణి, తోట రాంబాబు, యాగంటి సత్యనారాయణ, జంగం మరియమ్మ, వడ్లాని స్వప్న, కేశపోగు కరుణ, నంబూరి సీత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యాసనకు అనుకూల వాతావరణం కల్పించాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్
- ఎస్ఏ–1 పరీక్షల నిర్వహణను ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్
- ప్రీ-ప్రైమరీ చిన్నారులకు అందుతున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజన అమలు పరిశీలన



జూలూరుపాడు, మహా: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల పరిధి కొమ్ముగూడెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, పరీక్షల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, పోషకాహారం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఏ-1 పరీక్షలను కలెక్టర్ పరిశీలించారు. వివిధ తరగతుల విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును గమనించి, వారు రాస్తున్న ప్రశ్నపత్రాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ విధానం, విద్యార్థుల అభ్యసన స్థాయి తదితర వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాలలో మొత్తం 73 మంది విద్యార్థులు ఉండగా, సోమవారం 62 మంది విద్యార్థులు హాజరైనట్లు ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థుల హాజరు శాతం మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని, గైర్హాజరవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమన్వయం చేసుకొని వారు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, 'మన ఊరు-మన బడి' కార్యక్రమం కింద పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చేపట్టిన పనులు, వాటి ప్రస్తుత పరిస్థితి, విద్యార్థులకు వాటి ద్వారా కలుగుతున్న ప్రయోజనాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రీప్రైమరీ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. అక్కడ 14 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నట్లు తెలుసుకున్న ఆయన, వారికి అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులకు నూతనంగా అందించనున్న ఏకరూప దుస్తులను పరిశీలించారు. వారి వయస్సుకు అనుగుణంగా విద్యాబోధన జరుగుతున్న తీరును, చిన్నారులకు కల్పిస్తున్న అభ్యసన వాతావరణాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు ఆటల ద్వారా ఉల్లాసంగా నేర్చుకునేలా పాఠశాలలో ఏర్పాటు చేసిన బొమ్మలు, ఆట వస్తువులను కలెక్టర్ పరిశీలించారు. తరగతి గదుల్లో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని, ఆటలు, బొమ్మలు, ఇతర అభ్యసన సామగ్రిని వినియోగిస్తూ చిన్నారుల్లో ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న పోషకాహారంపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. ఉదయం 11 గంటలకు రాగిజావ, అనంతరం మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు ఉపాధ్యాయులు వివరించారు. మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, మెనూ, ఆహార పదార్థాలు, వంటశాల పరిశుభ్రత తదితర అంశాలను వంట నిర్వాహకురాలిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అభ్యసనకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతో పాటు వారి హాజరు, విద్యా ప్రమాణాలు, ఆరోగ్యం, పోషకాహారంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట స్థానిక తాహసిల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ జుంకీలాల్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు కేటాయించిన భూమిలో చాయ్ బండి ఏర్పాటు

**తొలగించేందుకు వచ్చిన అధికారులకు అడ్డంకులు**

**జవహర్ నగర్, మహా:** జవహర్ నగర్‌లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. రెవెన్యూ కార్యాలయం సమీపంలోని మోహన్‌రావు నగర్ కాలనీలో సర్వే నంబర్లు 611, 612, 613లో సుమారు 250 గజాల స్థలంలో నవీన్ అనే వ్యక్తి చాయ్ బంక్ ఏర్పాటు చేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ స్థలం రహదారికి కేటాయించిన ప్రభుత్వ భూమిగా అధికారులు గుర్తించారు. దీంతో స్థానికుల ఫిర్యాదుల మేరకు రెవెన్యూ అధికారులు చర్యలకు దిగారు. భారీ పోలీస్ బందోబస్తు మధ్య చాయ్ బంక్‌ను తొలగించేందుకు అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో చాయ్ బంక్ నిర్వాహకుడు నవీన్ గౌడ్‌తో పాటు అతని అనుచరులు పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు నవీన్ గౌడ్‌ను అదుపులోకి తీసుకోవడానికి అక్కడి నిర్మాణాలను తొలగించేందుకు భారీగా పోలీసులను మోహరించారు. కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం అధికారులు రహదారికి కేటాయించిన స్థలాన్ని ఖాళీ చేయించారు.

## ఖాదర్ బాబా సతీమణి జ్యోతి మృతికి ప్రముఖుల సంతాపం

**సత్తుపల్లి, అక్టోబరు 5: మహా:** సత్తుపల్లి పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు ఎస్కే ఖాదర్ బాబా సతీమణి జ్యోతి మృతి పట్ల సత్తుపల్లి శాసనసభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్ విజయకుమార్, మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య ప్రగాఢ సంతాపం తెలిపారు. జ్యోతి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారు ఖాదర్ బాబా, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని, జ్యోతి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు



# మహిళా సంఘాలకు రూ.6.94 కోట్ల రుణాలు

- మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం
- ప్రభుత్వ విప్ విజయ రమణ రావు

**పెద్దపల్లి మహా** : సుల్తానాబాద్: పట్టణంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు పలు సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు సుల్తానాబాద్ పట్టణ మహిళామణులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. అనంతరం సుల్తానాబాద్ పట్టణంలోని మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల కింద రూ.6.94 కోట్ల చెక్కును ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణారావు అందజేశారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం మహిళా సంఘాలను ప్రోత్సహిస్తోందని ఈ సందర్భంగా తెలిపారు. బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధి, చిన్నతరహా వ్యాపారాలను అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.




# దసరా,బతుకమ్మ ఉత్సవాలకు భీమన్న ఆలయం సిద్ధం

- ముమ్మరంగా ఉత్సవ ఏర్పాట్లు

**వేములవాడ,మహా**: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం సద్దుల బతుకమ్మ, విజయదశమి (దసరా) పర్వదినాల నేపథ్యంలో సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలు, సీరియల్ సెట్లు, హైమాస్ట్ ఫోకస్ లైట్లతో శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని కొలువుదీర్చేందుకు ప్రత్యేక పూజా మండపాన్ని సిద్ధం చేస్తున్నారు. మహిళా భక్తులు బతుకమ్మ ఆడటానికి, కోలాటం, దాండియా నృత్యాలు చేయడానికి వీలుగా భీమేశ్వర సదన్ వద్ద ఉన్న విశాలమైన పార్కింగ్ ప్రదేశాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. అక్కడ విద్యుత్ వెలుగులతో పాటు భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తూ, బతుకమ్మ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగేలా దేవస్థానం ఆధ్వర్యంలో పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఆలయ ఈవో రమాదేవి ఆదేశాల మేరకు ఆలయంలో జరుగుతున్న ముస్తాబు, అభివృద్ధి పనులను ఈఈ రాజేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులన్నీ సకాలంలో పూర్తి చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



# బాధితుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

- ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించాలి -సీపీ అంబర్ కిషోర్ ఝా

**పెద్దపల్లి మహా, రామగుండం**: ప్రజలు, బాధితులు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీసులను ఆశ్రయించాలని, ప్రతి ఫిర్యాదుపై చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. సోమవారం రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో సీపీ అంబర్ కిషోర్ ఝా బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, బాధితుల సమస్యలను చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు, బాధితుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీపీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.




# మంథని నియోజకవర్గంలో దళిత బంధు అమలు ఏమైంది?

- కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క దళిత కుటుంబానికైనా నిధులు ఇచ్చిందా!
- దళిత బంధు సాధన సమితి

**పెద్దపల్లి మహా** : గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి నియోజకవర్గంలో 100 దళిత కుటుంబాలను ఎంపిక చేసి, ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున అందించిన దళిత బంధు పథకం ద్వారా దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెంది ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో పథకాన్ని అమలు చేశారని దళిత బంధు సాధన సమితి నాయకులు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మంథని నియోజకవర్గంలో దళిత బంధు పథకం లేదా అంబేద్కర్ అభయహస్తం పథకం ద్వారా ఇప్పటివరకు ఏ ఒక్క దళిత కుటుంబానికైనా నిధులు అందించిందా? అని వారు ప్రశ్నించారు. ఈ అంశంపై సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో రాష్ట్ర దళిత బంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోకిల మహేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు గద్దల శంకర్, మంథని డివిజన్ దళిత బంధు అధ్యక్షుడు ఊట్ల శ్రీను తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంథని నియోజకవర్గంలో 100 దళిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున దళిత బంధు పథకం కింద ఆర్థిక సహాయం అందించిందన్నారు. దళితులు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత బంధు పథకాన్ని అమలు చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో అంబేద్కర్ అభయహస్తం పథకం కింద దళితులకు రూ.12 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలుకు సంబంధించి మంథని నియోజకవర్గంలో ఒక్క దళిత కుటుంబానికైనా నిధులు అందాయా అని వారు ప్రశ్నించారు. మంథని నియోజకవర్గానికి చెందిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రాష్ట్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉన్నప్పటికీ, దళితులకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత లేకపోవడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. దళిత బంధు, అంబేద్కర్ అభయహస్తం పథకాల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దళిత బంధు సాధన సమితి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం

- ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్య – విప్, ఎమ్మెల్యే విజయరమణారావు



పెద్దపల్లి మహా, ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికి నాణ్యమైన విద్య అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఎలిగేడు మండలం రామునిపల్లె వద్ద రూ.200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను సోమవారం సంబంధిత అధికారులతో, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ.. కుల, మత భేదాలకు అతీతంగా అన్ని వర్గాల విద్యార్థులు ఒకే వేదికపై నాణ్యమైన విద్యను అభ్యసించేలా ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్, అంతర్జాతీయ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత రెండున్నరేళ్లలో పెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సుమారు రూ.70 కోట్ల నిధులు మంజూరు చేయించి పాఠశాల భవనాలు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు తదితర మౌలిక వసతులను కల్పించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పదేళ్ల పాటు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని పట్టించుకోలేదని, అప్పటి ఎమ్మెల్యే ప్రభుత్వ విద్యాసంస్థల కంటే ప్రైవేటు విద్యాసంస్థలపైనే ఎక్కువ దృష్టి పెట్టారని విజయరమణారావు విమర్శించారు. రామునిపల్లెలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో సుమారు 2,560 మంది విద్యార్థులకు విద్య అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలతో పాటు హాస్టల్, ప్లే గ్రౌండ్, డైనింగ్ హాల్ తదితర సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇటీవల పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. టిఫిన్‌తో పాటు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగిజావ అందిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ సహకారంతో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు పౌష్టికాహారం అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ చదివే విద్యార్థులకు సంవత్సరానికి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఫీజులు చెల్లించాల్సి వస్తోందని, అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన విద్య, మౌలిక వసతులు కల్పిస్తున్నామని విజయరమణారావు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి అందుబాటులోకి వస్తున్న ఆధునిక సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలను అన్ని వసతులతో అభివృద్ధి చేసి విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తును అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని విజయరమణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, మండల పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభం

**ప్రభుత్వ విప్ విజయ రమణారావు**

**పెద్దపల్లి మహా:** సుల్తానాబాద్: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో, హరే రామ హరే కృష్ణ ట్రస్టు భాగస్వామ్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, విద్యాభ్యాసానికి తోడ్పాటు అందించడమే కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, స్థానిక నాయకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# సింగీతం శ్రీనివాసరావు అకాల మృతి

- చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటు
- అభ్యుదయ కళా సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్
- భద్రాద్రి కొత్తగూడెం, మహా: ప్రముఖ సినీ దర్శకులు సింగీతం శ్రీనివాసరావు అకాల మృతి

భారతదేశ చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటని అభ్యుదయ కళా సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. చుంచుపల్లిలో గల సంఘ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశానికి అధ్యక్షత వహించిన ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ముందుగా దివంగత సింగీతం శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి తన సంఘ సభ్యులందరితో కలిసి ఘనంగా నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య డాక్టర్ మద్దెల మాట్లాడుతూ పుష్పక విమానం చిత్రంతో మాటలు లేని మూకీ చిత్రంగా నిర్మించి సంచలనం సృష్టించిన వ్యక్తి సంగీతం శ్రీనివాసరావు అని పేర్కొన్నారు. అంతేకాకుండా యూనివర్సల్ ఉత్తమ నటుడు అందగాడు అయిన పద్మశ్రీ కమల్ హాసన్ తో విచిత్ర సహోదరులు లాంటి చిత్రంలో మరుగుజ్జు పాత్రను భామనే సత్యభామనే చిత్రంలో పూర్తి మహిళా పాత్రను అదేవిధంగా ఆదిత్య 369, భైరవద్వీపం, శ్రీకృష్ణార్జున విజయం , మయూరి, మైఖేల్ మదన కామరాజు ఇలాంటి ఎన్నో మధురమైన మరపురాని చిత్రాలను మనకు అందించిన గొప్ప లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావుని ప్రతి ఒక్క వర్ధమాన సినీ దర్శకులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆచార్య డాక్టర్ మద్దెల పిలుపునిచ్చారు. ఈ ఆత్మీయ సంతాపనివాళి కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లి శంకర్, ప్రముఖ సంగీత దర్శకులు అపర ఇళయరాజా మారపాక కృష్ణస్వామి, స్వర సంగీత విద్వాన్ కలవల రాందాస్, జూనియర్ రెహమాన్ సలవాది విజయ్, ప్రముఖ రిథమిస్ట్ దేవ సహాయం, గాయకుడు సబ్బారపు కృష్ణ, కళాకారులు ఎన్ వెంకటేశ్వర్లు, జనగం రాజయ్య, కడలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.





# పెండింగ్ నోటీసుల హియరింగ్ త్వరగా పూర్తి చేయండి

- పక్కా ప్రణాళికతో ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టిన జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక అభినందనలు
- 100 శాతం ప్రక్రియ పూర్తయ్యేలా మరింత దృష్టి సారించాలి
- నోటీసులపై తదుపరి చర్యలు ఆలస్యం కాకుండా చూడాలి..
- బిసి సంక్షేమ శాఖ కమిషనర్, ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బాల మాయా దేవి




**కరీంనగర్ మహా** : కరీంనగర్ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న నోటీసుల హియరింగ్‌ను నిర్ణీత సమయంలోగా త్వరగా పూర్తి చేయాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయా దేవి సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నోటీసులపై తదుపరి చర్యలు ఎలాంటి జాప్యం లేకుండా చేపట్టాలని ఆదేశించారు. సోమవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, డి. శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో బాల మాయా దేవి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల వారీగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు.

**జిల్లా కలెక్టర్, యంత్రాంగానికి ప్రత్యేక అభినందనలు**

కరీంనగర్ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పక్కా ప్రణాళికతో ముందుకు తీసుకెళ్తున్న జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, జిల్లా యంత్రాంగాన్ని బాల మాయా దేవి ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేసి 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. జిల్లాలో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఆకట్టుకుంది. కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల వారీగా ప్రక్రియ పురోగతి, పెండింగ్ అంశాలను వివరించారు. మిగిలిన ప్రక్రియను కూడా త్వరగా పూర్తి చేసేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

**పెండింగ్ నోటీసులపై ప్రత్యేక దృష్టి**

ఎస్ఐఆర్‌లో భాగంగా నోటీసులు అందుకున్నప్పటికీ నిర్ణీత సమయంలో హియరింగ్‌కు హాజరుకాని ఓటర్ల విషయంలో బీఎల్ఓలు మరోసారి వారి ఇళ్లకు వెళ్లాలని బాల మాయా దేవి సూచించారు. వారికి నోటీసులు అందించి, అవసరమైన వివరాలు, ధ్రువీకరణ పత్రాలను సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. నోటీసులపై తదుపరి చర్యలు ఆలస్యం కాకుండా క్షేత్రస్థాయిలో ఈఆర్వోలు, ఏఈఆర్వోలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఓటర్లకు అందించిన ప్రతి నోటీసుకు సంబంధించిన వివరాలను పక్కాగా రికార్డు చేసి, ఫైలింగ్ నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విచారణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని తెలిపారు.

**అర్హత కలిగిన ప్రతి ఓటరుకు చోటు**

అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా ఓటర్ల జాబితాలో చోటు కోల్పోకుండా అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని బాల మాయా దేవి సూచించారు. నోటీసులు సంబంధిత ఓటర్లకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని ఈఆర్వోలు, ఏఈఆర్వోలు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, ఓటర్లకు అవసరమైన పత్రాలు, నోటీసులకు సంబంధించిన అంశాలపై స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. ఫారం 6, ఫారం 7, ఫారం 8 ద్వారా స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిశీలించి పరిష్కరించాలని బాల మాయా దేవి ఆదేశించారు. ఎలాంటి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

**ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నాం**

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా యంత్రాంగం ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించిందని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా నిబంధనల ప్రకారం ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి నోటీసుల పరిశీలన, సంబంధిత పత్రాల స్వీకరణ, దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పూర్తి చేస్తున్నారని తెలిపారు. పెండింగ్ నోటీసుల పరిష్కారంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ, మిగిలిన ప్రక్రియను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, డి. శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో షర్మిల, తహసీల్దార్లు, అసిస్టెంట్ ఈఆర్వోలు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

- పెండింగ్ నోటీసులు, విచారణలను పండుగకు ముందే పూర్తి చేయాలి
- ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బాల మాయాదేవి

**పెద్దపల్లి మహా :** ఎస్ఐఆర్ 2026 ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాల మాయాదేవి అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసులు, విచారణలను పండుగకు ముందే పూర్తి చేయాలని సూచించారు. సుల్తానాబాద్‌లోని 3వ వార్డు పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్‌ను ఆమె జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పరిశీలించారు. హెల్ప్‌డెస్క్‌ల వద్ద ఓటర్ల సందేహాలను నివృత్తి చేసి, అవసరమైన పత్రాలు, దరఖాస్తులపై స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. ఫారం 6, 7, 8 దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి నోటీసుల పరిశీలన, పత్రాల సేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కువ సంఖ్యలో ఓటర్ల తొలగింపులు, చేర్పులు నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేకంగా పరిశీలించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనామలీలు, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, అవసరమైన పత్రాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. 18 ఏళ్లు పూర్తిచేసుకునే అర్హులైన యువత నుంచి ఫారం 6 దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నిబంధనలను పాటిస్తూ, ప్రతి దశను పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులు, బీఎల్ఓలకు అబ్జర్వర్ సూచించారు.





# ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి: కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డిఆర్ఓ పద్మావతితో కలిసి ప్రజల నుంచి వినతులు ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ముఖ్యమైన వేదికగా నిలుస్తోందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం జాప్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఎలాంటి ఆలస్యం లేకుండా పరిష్కరించాలని క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలోని ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతులు సమర్పించి స్థానిక స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు. వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



# ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

**కరీంనగర్ మహా**: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా మేనేజింగ్ కమిటీకి నూతన కార్యవర్గం ఎన్నికైంది. డిప్యూటీ కోఆపరేటివ్ ఆఫీసర్ సమక్షంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. చైర్మన్‌గా సంగెం లక్ష్మణరావు, వైస్ చైర్మన్‌గా రాధాకృష్ణారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా కుందారపు మహేశ్వర్, కోశాధికారిగా గోనె శ్రీనివాస్, చీఫ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా పెండ్యాల కేశవరెడ్డి ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా రాగి శ్రీనివాస్, రాజిరెడ్డి, కాన్పర్తి మనోహర్‌రావు, యూత్ కోఆర్డినేటర్‌గా మొగలోజు రాకేష్ ఎన్నికయ్యారు.

**మానవతా సేవలకు మరింత విస్తృత ప్రాధాన్యం**

ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాలో మానవతా సేవలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. రక్తదాన కార్యక్రమాలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, ఆరోగ్య సేవలు, యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

**ప్రతి వర్గానికి సేవలు చేరేలా కృషి**

సమాజంలోని ప్రతి వర్గానికి రెడ్‌క్రాస్ సేవలను మరింత చేరువ చేసేందుకు సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. సంస్థ ఆశయాలు, సేవా స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు నూతన కార్యవర్గం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

**అభినందనలు**

నూతన కార్యవర్గ సభ్యులను టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎడ్ల అరవింద్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు సర్దార్ హర్మిందర్‌సింగ్, పట్టణ సంఘం అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, నాయకులు సత్యనారాయణ, అస్గర్ అలీ, అజయ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, జాడ కమలాకర్ రఘోత్తం రెడ్డి తదితరులు అభినందించారు. పలువురు రెడ్‌క్రాస్ స



# మహనీయుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి మహా** : మహనీయుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు సేవ చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గడ్డం వెంకటస్వామి (కాక) 96వ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మారుమూల ప్రాంతంలో జన్మించిన గడ్డం వెంకటస్వామి కేంద్ర మంత్రిగా, పలు కీలక పదవుల్లో పనిచేసి ప్రజలకు విశేష సేవలు అందించారని కొనియాడారు. ఆయన మన ప్రాంతంలో జన్మించడం గర్వకారణమన్నారు. పేదలు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి వెంకటస్వామి చేసిన కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ తెలంగాణ కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు. కోల్‌బెల్ట్ ప్రాంత కార్మికుల హక్కుల కోసం పోరాడి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్, సీపీఓ రవీందర్, ఇంటర్మీడియట్ అధికారి కల్పన, యువజన, క్రీడల శాఖ అధికారి సురేష్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# క్రమశిక్షణే చిన్నారుల తొలి పాఠం

- అంగన్వాడీల్లో ఆటపాటలతో విద్యాబోధన.. పోషణ మాసంలో సామూహిక సీమంతాలు

**సత్తుపల్లి, అక్టోబరు 5**: మహా : చిన్నారులకు చదువుతోపాటు క్రమశిక్షణ, పరిశుభ్రత, మంచి అలవాట్లను చిన్ననాటి నుంచే నేర్పించడమే అంగన్వాడీ కేంద్రాల ప్రధాన లక్ష్యమని చింతకాని సెక్టార్ పర్యవేక్షకురాలు సంధ్యారాణి అన్నారు. ఆటపాటలతో విద్యాబోధన చేస్తూ.. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన సేవలను అందిస్తున్నామని తెలిపారు. చింతకాని మండలం నాగిలిగొండ 1, 2 అంగన్వాడీ కేంద్రాల పరిధిలో సోమవారం 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ ఉపాధ్యాయులు అలివేలుమంగమ్మ, లేయమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఏపూరి పద్మ సహకరించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని, వ్యాధుల నివారణకు పరిశుభ్రతే కీలకమని సూచించారు.

**సంప్రదాయబద్ధంగా సీమంతాలు**

పోషణ మాసం సందర్భంగా గర్భిణీలకు సంప్రదాయ పద్ధతిలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. చీర, సారె, పూలు, పండ్లు, చలిమిడి, పసుపు, కుంకుమ, గాజులతో వారిని సత్కరించారు. పుట్టినిల్లు, మెట్టినిల్లులో నిర్వహించే సంప్రదాయాలను అంగన్వాడీ కేంద్రాల్లోనూ కొనసాగించడం ఆనందంగా ఉందని సర్పంచ్ ఏపూరి పద్మ అన్నారు. మహిళలు, శిశువుల అభివృద్ధి, సంక్షేమం కోసం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా అంగన్వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలను ఆమె అభినందించారు. ప్రొద్దుటూరు గ్రామ పల్లె దవాఖాన వైద్యురాలు మధుమైకు సీమంతం నిర్వహించడం మధురానుభూతిని కలిగించిందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# 'కళ్యాణ లక్ష్మి 'కనుమరుగేనా....?

- కాంగ్రెస్ పాలకులకు శాపంగా మారనుందా.....?
- వచ్చే ఎన్నికలకు ఎఫెక్ట్ తప్పదంటున్న నాయకులు.




**దమ్మపేట ,మహా** : నిరుపేద ,బడుగు బలహీన వర్గాలకు అండగా ,ప్రతి ఇంట్లో జరిగే ఆడబిడ్డ వివాహానికి కుటుంబ కానుకగా అందించే 'కళ్యాణ లక్ష్మి , పథకం నేడు కనుమరుగవుతుందా...? అంటూ స్థానిక బాధితులు ,ఆశావహులు అయోమయంలో ఉన్నారు. ఒక వేళ ఈ పథకం గనుక కనుమరుగైతే వచ్చే రాజకీయ భవిష్యత్ లో కాంగ్రెస్ పాలకుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారకతప్పదని కొందరు భావిస్తున్నారు. ఇప్పటికే వివాహాలు జరుపుకున్న నిరుపేదలు సంవత్సరాల తరబడి కళ్యాణ లక్ష్మి పథకం అందుకోవడం కోసం అర్రులు చాస్తూ ఎదురుచూస్తున్నారు. పాలకులు మాత్రం కోర్టులు ,తీర్పులు అంటూ కాలంవెళ్ళదీస్తున్నారు. అక్కరకురాని పథకాలను ప్రజలమధ్యలోకి ప్రవేశ పెట్టి అనవసరంగా ప్రభుత్వ ఆర్థిక భారాన్ని ప్రజలపై మోపడం కంటే ,పలు నిరుపేద కుటుంబ సభ్యులకు ఆసరాగా ఉండటం లేదని నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అందించే లక్ష రూపాయల ఆసరా అనేది ఓ నిరుపేద కుటుంబానికి చాలా అవసరంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉన్న శాసనసభ్యులు జారె ఆదినారాయణ ఈ విషయమై త్వరితగతిన సానుకూలంగా స్పందించాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే కొందరు పాలకుల తీరుతో , లోకల్ చోటా నాయకులతో ఎన్నో విధాలుగా ఇబ్బందులు ఎదుర్కొనడం , పథకాలు సక్రమంగా అందకపోవడంతో నిరాశతో ఉన్నట్లు సమాచారం . రాబోయే ఎన్నికల కు నిరుత్సాహం తోడవకముందే ఆశావహులకు అండగా పాలకులు నిలవాలని కోరుతున్నారు. అధికారులను అప్రమత్తం చేయడంలో స్థానికంగా ఉన్న పాలకవర్గ నాయకులు ఉత్సాహం తో లబ్ధిదారులకు చేయూత గా ఉండాలని కోరుతున్నారు. కళ్యాణలక్ష్మి పథకం త్వరలోనే అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

# పీహెచ్‌సీల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి!

**పెద్దపల్లి మహా :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. వై. పవిత్ర సూచించారు. సోమవారం పీఓ ఎంహెచ్ఎన్ డా. లక్ష్మి భవానితో కలిసి కూనారం, శ్రీరాంపూర్ పీహెచ్‌సీలను సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలోని వార్డులు, ఫార్మసీ గదులను తనిఖీ చేసి, రోగులకు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలు, వార్డులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి, రోగులకు సకాలంలో వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.



# కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శిం చిన మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాల చారి

- కూటమి నాయకులు ,అభ్యర్ధి
- ఘన స్వాగతం పలికిన కంది శ్రీనివాస రెడ్డి
- శాలువాలతో సత్కారం



**ఆదిలాబాద్ మహా:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గుర్తింపు యూనియన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ పట్టణానికి విచ్చేసిన మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాల చారి, కూటమి అభ్యర్థి మొగుళ్ళ రాజారెడ్డి, ఎస్ డబ్ల్యూ యూ జనరల్ సెక్రటరీ మల్లేష్,ఎస్డబ్ల్యూఎఫ్ ప్రచార కార్యదర్శి రవీందర్ రెడ్డి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. పార్టీ శ్రేణులతో కలిసి కంది శ్రీనివాస రెడ్డి వారికి పూలబొకేలతో ఘనంగా స్వాగతించి శాలువాలతో సత్కరించారు. అనంతరం వారు కంది శ్రీనివాస రెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గుర్తింపు యూనియన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ పట్టణానికి విచ్చేసిన మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాల చారి, కూటమి అభ్యర్థి మొగుళ్ళ రాజారెడ్డి, ఎస్ డబ్ల్యూ యూ జనరల్ సెక్రటరీ మల్లేష్,ఎస్డబ్ల్యూఎఫ్ ప్రచార కార్యదర్శి రవీందర్ రెడ్డి ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. పార్టీ శ్రేణులతో కలిసి కంది శ్రీనివాస రెడ్డి వారికి పూలబొకేలతో ఘనంగా స్వాగతించి శాలువాలతో సత్కరించారు. అనంతరం వారు కంది శ్రీనివాస రెడ్డిని సత్కరించారు.





# సారంగపల్లిలో ఘనంగా 97వ కాకా వెంకటస్వామి జయంతి వేడుకలు

**మందమర్రి, మహా** : మందమర్రి మండలంలోని సారంగపల్లి గ్రామంలో మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ డాక్టర్ గడ్డం వెంకటస్వామి (కాకా) 97వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కదారి జీవన్ కుమార్ ఆధ్వర్యంలో కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల చెమట చుక్కలోనే దేశ ప్రగతి దాగి ఉందని, వారి హక్కులను కాలరాసే హక్కు ఎవరికీ లేదని కాకా నమ్మేవారని అన్నారు. కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఎన్నో సంస్కరణలు చేపట్టారని, రాజకీయం అంటే పదవులు అనుభవించడం కాదు, అణగారిన వర్గాలకు అండగా నిలబడటమని చాటి చెప్పారన్నారు. అణగారిన వర్గాల పిల్లలకు చదువే అసలైన ఆయుధమని భావించి అంబేద్కర్ పేరు మీద విద్యా సంస్థలను స్థాపించారని, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో, రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి సొంత భవనాన్ని ఇచ్చిన గొప్ప నాయకుడు కాకా అని వెల్లడించారు. హైదరాబాద్ శివారులో 75 నుంచి 80 వేల మందికి గుడిసెలు వేయించిన మహనీయుడని కాకా అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు మాసు సంతోష్ కుమార్, సుమలత, ఎస్సీ సెల్ అధ్యక్షులు వేల్పుల శంకర్, మండల సెక్రటరీ నర్సింగోజు తిరుపతి, జనరల్ సెక్రటరీ ఆకుల అంజి, స్పోక్స్ పర్సన్ ఎగుడా రాజమల్లు, సర్పంచులు బచ్చలి రాములు, పెరమండ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**మాజీ కేంద్రమంత్రి కాకా విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ**

కాంగ్రెస్ పార్టీ కేంద్ర మంత్రి స్వర్గీయ గడ్డం వెంకటస్వామి కాకా విగ్రహ ప్రతిష్టకు సోమవారం సింగరేణి గ్రీన్ పార్క్ ముందర భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు రఘునాథరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పుల్లూరి లక్ష్మణ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు పైడిమల్ల నర్సింగ్, కాంగ్రెస్ మందమర్రి పట్టణ అధ్యక్షులు మండ తిరుమల్ రెడ్డి, చెప్పకుర్తి శశిధర్, బండి శంకర్, రాయబారపు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాకా వెంకటస్వామి 97వ జయంతి వేడుకలు

**బెల్లంపల్లి, మహా:** కేంద్ర మాజీ మంత్రివర్యులు దివంగత నేత కాకా వెంకటస్వామి 97వ జయంతి వేడుకలను బెల్లంపల్లి పట్టణంలోని ఏఎంసి వద్ద ఉన్న విగ్రహానికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ కార్యాలయం నుండి ఏఎంసి కాకా విగ్రహం వరకు బైకులతో కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు . అనంతరం కాంగ్రెస్ కార్యాలయం యొక్క చేరుకొని జయంతి వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి కాక చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ కాకా చేసిన సేవలను కొనియాడారు.స్వాతంత్ర సమరయోధుడని,తెలంగాణ ఉద్యమ వీరుడు, బహుజన ఆత్మగౌరవ ప్రతీక అని ,సింగరేణి కార్మిక సంక్షేమ బాంధవుడు,పేదలు, కార్మికుల సంక్షేమం కొరకు పాటుపడిన కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ గడ్డం వెంకటస్వామి అని ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పిసిసి మెంబర్చిలుముల శంకర్, సీనియర్ నాయకులుమల్లారపు చినరాజం, గెల్లి రాజలింగు, మతమారి సత్తిబాబు,జగన్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాగం శెట్టి సతీష్,కౌన్సిలర్లు చింతల వసంత, జంగం కల్పన, పున్నం చంద్రు, భేతి శ్రావణ్ కుమార్,నిజాముద్దీన్, ఇప్ప కుమారస్వామి,చిప్ప అర్చన, డిసిసి సెక్రటరీజమ్మికుంట విజయ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు చిప్ప మనోహర్, పోలు శ్రీనివాస్, గాలి శ్రీనివాస్, కుంభాల రాజేష్, గద్దల కుమార్, అలీ భాయ్, కాంపల్లి సతీష్, ఎలుక ఆకాష్, కాసర్ల యాదగిరి,బత్తుల రాజలింగు, సబ్బని రాజనర్సు, పాముల రాజలింగు, రేగుంట రాజలింగు,పట్టణ కమిటీ అధికార ప్రతినిధిదేవసాని ఆనంద్,జనరల్ సెక్రటరీలు కన్నూరి వెంకటేష్,దెబ్బటి రమేష్,కొట్టే వెంకటస్వామి,గంధం రమేష్, వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ ఖలీల్,వాజిద్,కేశబోయిన శ్రీను, సెక్రటరీ ఎల్తూరి శంకర్, పరమేష్, సాయికిరణ్, కార్యవర్గ సభ్యులు రాస బత్తుల వెంకటి వెంకటి, అరకొండ మొండి,మహిళ నాయకులు చుంచు వెంకట లక్ష్మి,మోర్ల లక్ష్మి, మండల స్వరూప,మాజీ కౌన్సిలర్లు, డిసిసి నాయకులు,పట్టణ కమిటీ నాయకులు, బీసీ సెల్, ఎస్సీ సెల్, మైనార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కమిటీ సభ్యులు,34 వార్డుల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# కాంగ్రెస్ కూటమి అభ్యర్ధులను గెలిపించండి

- ఆర్టీసీని ప్రభుత్వం లో విలీనం చేసేందుకు సీయం చర్యలు చేపడుతున్నారు.
- బాణం గుర్తుకే ఓటు వేసి మొగుళ్ల రాజారెడ్డిని గెలిపించాలి
- ప్రతీనెల ఒకటో తేదీనే జీతాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- కార్మికుల సమస్యలను పరిష్కరిస్తుంది
- ఆర్టీసీ బలోపేతానికి సహకరించండి
- గుర్తింపు ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నఅసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి, మాజీ మంత్రి వేణుగోపాల
- కూటమి నాయకులు



**ఆదిలాబాద్ మహా** : టీజీఆర్టీసీని ప్రభుత్వం లో విలీనం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని కార్మికులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. టీజీఎస్ ఆర్టీసి గుర్తింపు సంఘ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపో ఆవరణలో జరిగిన సభ కు ఆయన మాజీ మంత్రి వేణుగోపాల చారి , బోథ్ ఇంచార్జి ఆడె గజేందర్ ,ఎస్ డబ్ల్యూ యూ ,ఎస్డబ్ల్యూఎఫ్ జనరల్ సెక్రటరీలు మల్లేష్, రవీందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ , అభ్యర్థి మొగుల్ల రాజారెడ్డి తో కలిసి హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ఇచ్చిన టీఎంయూ,ఎస్ డబ్ల్యూ సీ ,ఐఎన్ టీయూసీ మిత్రపక్షాల అభ్యర్ధులను గెలిపించాలని కార్మికుల హక్కుల కోసం పోరాడే నాయకులు మొగుళ్ల రాజారెడ్డి ని బాణం గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు.క్లాస్ III, క్లాస్VIకు సంబంధించిన రెండు ఓట్లను కూడా బాణం గుర్తుకే వేయాలని కోరారు. ఆర్టీసీకి సంబంధించిన బకాయిలను ప్రభుత్వం విడుదల చేసిందని, సంస్థను లాభాల బాట పట్టించేందుకు చర్యలు చేపట్టిందని అన్నారు. ప్రతీ నెల ఒకటో తేదీనే జీతాలు ఇచ్చే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. ఆర్టీసీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ఉద్యోగ భద్రత, వేతన సవరణ, పనిభారం తగ్గింపు వంటి మిగిలిన డిమాండ్లను కూడా త్వరలోనే ప్రభుత్వం త్వరలో పరిష్కరిస్తుందని మాజీ మంత్రి వేణుగోపాల చారి అన్నారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే కార్మికుల తరపున వారి హక్కుల కోసం సంక్షేమం కోసం కృషి చేస్తానని కూటమి అభ్యర్థి మొగుళ్ల రాజారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ ,ఆదిలాబాద్ బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్లు శ్రీకాంత్ రెడ్డి , మల్లెపూల సత్యనారాయణ , ఆదిలాబాద్ బోథ్ ఆత్మ కమిటీ చైర్మన్లు గిమ్మ సంతోష్, రాజు యాదవ్ , పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కిజార్ పాషా , సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు ఫ్రంటల్ ఆర్గనైజేషన్ ఇన్చార్జ్ డేరా కృష్ణారెడ్డి, ఆసిఫ్ ఖాన్ , ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్ , అనిల్ గారు, భీమ్ రావు , ఎస్కే నజీర్ , బండి దేవిదాస్ చారి గారు, బెజ్జంకి అనిల్ కుమార్ , గౌలి సంజీవ్ కుమార్ జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, నెన్నెల పోలీసుల దాడి

**ఏడుగురు అరెస్ట్, రూ.10,110 నగదు, బైకులు స్వాధీనం**

**మంచిర్యాల / నెన్నెల, మహా :** నెన్నెల మండలం అవడం గ్రామంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, నెన్నెల పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. నార్కోటిక్ టీమ్ / టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్‌కు శనివారం రాత్రి అవడం గ్రామంలో డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కలాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం వచ్చినట్లు వారు వెల్లడించారు.
దీంతో ఎస్ఐలు దీకొండ రమేష్, లచ్చన్న, సిబ్బంది, నెన్నెల పోలీసుల సహకారంతో అక్కడ దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.10,110 నగదు, 4 సెల్‌ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. పట్టుబడిన నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నెన్నెల పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ.కు అప్పగించారు. అక్రమ పేకాట, జూదం వంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు.

# నిర్మల్ లో మంత్రుల పర్యటన

- గుడిసెలు లేని తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం
- భూ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం
- అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా అధికారులు పని చేయాలి
- మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలు



**నిర్మల్ మహా** : రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించి, తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.సోమవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నివసిస్తున్న అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల్లో నివసిస్తున్న సుమారు 72 వేల నుంచి 73 వేల మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. మొదటి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టగా, రెండో దశలో మరో రెండు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణానికి చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు.ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించి నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అటవీ సంబంధిత సమస్యల కారణంగా ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోకుండా, పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని సూచించారు. అవసరమైతే ఈ అంశంపై రాష్ట్రస్థాయిలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూముల సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి తెలిపారు. గతంలో సుమారు 125 ఏళ్ల క్రితం భూముల సర్వే జరిగిందని, ప్రస్తుతం వచ్చే ఏడాదిన్నరలో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో భూ సర్వే పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మనిషికి ఆధార్ ఎలాగో ప్రతి భూ కమతానికి భూధార్ రూపొందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. భూముల సమగ్ర సర్వేతో భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా చూడవచ్చని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.సర్వేను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అదనపు సామగ్రిని సమకూరుస్తామని తెలిపారు. యువ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. భూ సర్వేలో పనిచేయడం ద్వారా అధికారులకు క్షేత్రస్థాయి పరిపాలనపై మంచి అవగాహనతో పాటు భవిష్యత్తులో తమ సర్వీసులో ఉపయోగపడే అనుభవం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో రెవెన్యూ, అటవీ శాఖలకు సంబంధించిన సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో భూ సర్వేను దశలవారీగా నిర్వహించి, ప్రతి భూ కమతానికి ల్యాండ్ పార్సెల్ మ్యాపింగ్ (ఎల్‌పీఎం) నంబర్ కేటాయించే ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. భూములకు సంబంధించిన సమగ్ర వివరాలను నమోదు చేసి, భూ హక్కులకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలి**

రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సమర్థవంతంగా అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా పరిపాలన ఉండాలని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి బలమైన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అటవీ సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని, సంబంధిత అధికారులు తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ సర్వే ఒక గొప్ప అవకాశమని మంత్రి పేర్కొన్నారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించాలని, నిర్దేశిత గడువులోగా సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్‌కుమార్, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

**మంచిర్యాల, మహా:** మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. పదవ తరగతి విద్యార్థి బి.సాయి చరణ్ అండర్17 ఎస్‌జీఎఫ్ ఫుట్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఆదివారం బెల్లంపల్లిలోని తిలక్ స్టేడియంలో జరిగిన జోనల్ స్థాయి అండర్17 ఫుట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెడ్మాస్టర్ బండి రమేష్, పీడీ రాజయ్య తెలిపారు. ఈ నెల 12 నుంచి 14 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సాయి చరణ్ పాల్గొంటారని తెలిపారు. అదేవిధంగా అండర్14 బాలుర విభాగంలో 9వ తరగతి విద్యార్థులు సిహెచ్.సాకేత్, ఎస్.ప్రణీత్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వారు వచ్చే నెలలో మేడ్చల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు.రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.



# బిజెపి ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లకు ఆయాలకు సన్మానం

- నరేంద్ర మోదీ 25 సంవత్సరాల సుపరిపాలన, అంకిత భావం సందర్భంగా
- " సేవా సంకల్ప్ అభియాన్ " కార్యక్రమంలో భాగంగా

**బెల్లంపల్లి, మహా:** దేశ ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాల సుపరిపాలన,అంకిత భావం తో కూడిన సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో సోమవారం రోజు బెల్లంపల్లి భాజపా పట్టణ అధ్యక్షులు దార కళ్యాణి ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు,ఆయాలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అమురాజుల శ్రీదేవి,బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమ జిల్లా కన్వీనర్ పట్టి వెంకట కృష్ణ హాజరై అంగన్వాడీ, టీచర్లకు ఆయాలకు శాలువాలతో సన్మానించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి ప్రజా సేవకు ప్రతీకగా జరుగుతున్న 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 7 వరకు దేశవ్యాప్తంగా 'అంగన్వాడీ ఉత్సవాలు' ఘనంగా నిర్వహించబడుతున్నాయనీ సమాజంలో పసిపిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ, గర్భిణీలు,బాలింతల ఆరోగ్య రక్షణలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని,ఒక దేశ భవిష్యత్తు ఆ దేశ బాలల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందనీ, బాలలకు సరైన పోషకాహారం, ప్రాథమిక విద్యను అందించి వారిని భావి పౌరులుగా తీర్చిదిద్దడంలో అంగన్వాడీ కార్యకర్తలు (టీచర్లు), ఆయాలు అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు.ఇంటి వద్ద తల్లిదండ్రులు ఎలా చూసుకుంటారో, కేంద్రానికి వచ్చిన ప్రతి చిన్నారినీ అంతకంటే ఎక్కువగా ప్రేమతో ఆప్యాయతతో చూసుకునే 'అంగన్వాడీ దీదీల' సేవలు వెలకట్టలేనివి అని అన్నారు .కార్యక్రమంలో భాజపా జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ ,సీనియర్ నాయకులు దూది ప్రకాష్, జీదుల రాములు, యువ మోర్చా అధ్యక్షుడు తోటపల్లి ఓం సాయి ,ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు ఇప్ప స్వామి ,కార్యకర్తలు, నాయకులు,పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపిన ఫార్మసీ కౌన్సిల్ మాజీ వైస్ చైర్మన్

- ఫార్మసీ యాక్ట్ 1948 - సెక్షన్ 42 కఠిన అమలుకు వినతి
- ఔషధ నియంత్రణ చట్టాల అమలుకు పక్కా కార్యాచరణ
- డైరెక్టర్ జి. రాంధన్



**హనుమకొండ, మహా** : తెలంగాణ టీజీ సేఫ్ డ్రగ్స్ కంట్రోల్ విభాగం రాష్ట్ర డైరెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జి. రాంధన్ ను రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పు భాస్కరరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఫార్మసీ యాక్ట్ 1948లోని సెక్షన్ (42) మరింత కఠినంగా అమలు చేయాలని కమ్యూనిటీ ఫార్మసీలల్లో అర్హులైన ఫార్మసిస్టుల ద్వారానే మందుల పంపిణీ జరిగేలా చూడాలని, వినియోగదారులకు మరింత మెరుగైన చట్టబద్ధమైన సేవలను అందించేందుకు కృషిచేయాలని ఈ సందర్భంగా ఉప్పు భాస్కర్ రావు డైరెక్టర్ ను కోరారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాంధన్ మాట్లాడుతూ ఔషధ వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడమే ధ్యేయంగా డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్టును నిర్దిష్టంగా పటిష్టంగా అమలు చేసేందుకు కృషి చేస్తామని తెలపారు. సమాజంలో ఫార్మసిస్టుల సేవలు ఎంతో కీలకమైనవని కొనియాడారు. ఫార్మసిస్టులందరూ అంకితభావంతో, చిత్తశుద్ధితో తమ వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో టిజి సేఫ్ కమిషనర్ పర్యవేక్షణలో డ్రగ్స్ కంట్రోల్ విభాగానికి సంబంధించిన చట్టాలను పటిష్టంగా అమలు చేయడానికి ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నట్లు చెప్పారు. టి.జి. సేఫ్ కమిషనర్ అంజన్ కుమార్ నేతృత్వంలో సమర్థవంతమైన నాయకత్వం మార్గదర్శకత్వంలో ప్రజలకు మరింత మెరుగైన, చట్టబద్ధమైన సేవలు అందించేందుకు డ్రగ్స్ కంట్రోల్ విభాగం నిరంతరం శ్రమిస్తుందని స్పష్టం చేశారు.



# సీకేఎం లెక్చరర్ సతీష్ కుమార్ ను విధుల నుంచి తొలగించాలి

- స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు

**వరంగల్, కలెక్టరేట్ మహా** : సికేఎం కళాశాల జువాలజీ లెక్చరర్ ఎన్సిసి కెప్టెన్ సతీష్ కుమార్ ను విధుల నుండి పూర్తిగా తొలగించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద దేవికి సోమవారం ప్రజావాణిలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఎల్తురి సాయికుమార్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్తురి సాయికుమార్ మాట్లాడుతూ సీకేఎం కళాశాల లోని కొంతమంది విద్యార్థినిలను అలాగే ఎన్సిసి విద్యార్థినిలను కూడా లైంగికంగా వేధిస్తున్న కళాశాల జువాలజీ లెక్చరర్ ఎన్సిసి కెప్టెన్ సతీష్ కుమార్ పై ఎంక్వయిరీ జరుగుతున్న క్రమంలోనే అతను కాలేజీల్లో విధులు నిర్వర్తిస్తూ విద్యార్థినీల ను భయబ్రాంతులకు గురి చేస్తూ నా పై జరుగుతున్న ఎంక్వయిరీ లో అధికారులు గానీ వేరే ఇతరులు ఎవరు అడిగినా సానుకూలంగా సౌమ్యుడని చెప్పాలని భయాందోళనలకు గురి చేస్తున్న లెక్చరర్ సతీష్ ను తక్షణమే విధుల నుంచి పూర్తిగా తొలగించాలని బాధిత విద్యార్థిని లకు న్యాయం చేయాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్ యూనియన్ హనుమకొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్ చెట్టు పల్లి శివ కుమార్ కేడీసీ కాలేజ్ అధ్యక్ష కార్యదర్శులు రాజ్ కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.




# భద్రతపై ముందస్తు చర్యలే ప్రమాదాల నివారణకు మార్గం..

- ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకం
- మణుగూరు ఎంవీటీసీలో రెండో బ్యాచ్ శిక్షణ ప్రారంభంలో..
- ఎస్ఓటు జీఎం డి వెంకట రామారావు

**మణుగూరు, మహా :** గనుల్లో ప్రమాదాలను నివారించేందుకు ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్ టు జీఎం డి వెంకట రామారావు సూచించారు. మణుగూరు ఏరియాలోని మైన్స్ వొకేషనల్ ట్రైనింగ్ సెంటర్ (ఎంవీటీసీ)లో ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్ల కోసం నిర్వహిస్తున్న రెండో బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట రామారావు మాట్లాడుతూ గని కార్యకలాపాల్లో ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్లదే కీలక బాధ్యత అన్నారు. పని ప్రదేశాల్లో భద్రతా పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, కార్మికులు సురక్షిత పద్ధతుల్లో విధులు నిర్వహించేలా పర్యవేక్షించాలని సూచించారు. భద్రతా నియమాలను ఉల్లంఘించే పరిస్థితులు ఎదురైనప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగికి వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగం, ప్రమాదాల నివారణ పద్ధతులు, సురక్షిత పని విధానాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రమాదం సంభవించిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే ప్రమాదకర పరిస్థితులను గుర్తించి నివారణ చర్యలు చేపట్టడమే ఉత్తమ భద్రతా విధానమన్నారు. అనుకోని పరిస్థితులు లేదా ప్రమాదకర చర్యలు కనిపించిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గనుల్లో భద్రతా ప్రమాణాలను పాటించేందుకు సంస్థ అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే ప్రమాదరహిత పని వాతావరణాన్ని సాధించగలమన్నారు. శిక్షణలో పొందిన జ్ఞానాన్ని విధి నిర్వహణలో ఆచరణాత్మకంగా వినియోగిస్తూ తమ పరిధిలోని ఉద్యోగుల్లో భద్రతా సంస్కృతిని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమం అక్టోబర్ 17వ తేదీ వరకు రెండు వారాలపాటు కొనసాగనుంది. కార్యక్రమంలో ఎంవీటీసీ వైస్ ప్రెసిడెంట్ వి కృష్ణంరాజు, సీఎంపీఎఫ్ ప్రతినిధి అండ్ ఫైనాన్స్ మేనేజర్ పి రమేష్, ఏరియా రక్షణ అధికారి జె నాగేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంవీటీసీ బి బాబ్జీ, ఎంవీటీసీ నాయకుడు దండు విజయ్ తదితరులతో పాటు ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# వరంగల్ లో ప్రయాణికుల భద్రతకు భరోసా

- అభయ-మై ట్యాక్సీ సేఫ్ యాప్ ను ప్రారంభించిన వరంగల్ సీపీ
- నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి భాధ్యత




**హనుమకొండ, మహా :** ప్రయాణికుల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపిఎస్ స్పష్టం చేశారు. నిబంధనలు పాటించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రత కోసం అత్యాధునిక అభయ మై ట్యాక్సీ సేఫ్ యాప్ ను వరంగల్ సీపీ ఘనంగా ప్రారంభించారు. ఈ నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆటోలు, ట్యాక్సీ ల్లో ప్రయాణించే ప్రయాణికుల భద్రత కోసం పోలీస్ శాఖ కీలక అడుగు వేసింది. సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన కార్యక్రమంలో సీపీ అభయ మై ట్యాక్సీ సేఫ్ యాప్ ను లాంఛనంగా ప్రారంభించిన అనంతరం సీపీ ఎన్ శ్వేత ఐపిఎస్ మాట్లాడుతూ... ప్రయాణికుల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యం అని అన్నారు. నగరంలో ఆటోలు, ట్యాక్సీ ల్లో మహిళలు, విద్యార్థులు సురక్షితంగా ప్రయాణించేలా ఈ యాప్ దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా యాప్ ప్రత్యేకతలను సిపి వివరించారు. ముఖ్యంగా ఆటో, ట్యాక్సీ ఎక్కగానే క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే డ్రైవర్ పూర్తి వివరాలు, వాహన నంబర్ పోలీస్ కంట్రోల్ రూమ్ కు వెళ్తుందని ప్రయాణంలో ఏదైనా ఇబ్బంది తలెత్తితే ఎస్ ఓ ఎస్ బటన్ నొక్కితే వెంటనే పోలీసులకు సమాచారం అందుతుందని అంతేకాకుండా ప్రయాణికులు తమ లైవ్ లొకేషన్ ను కుటుంబ సభ్యులకు షేర్ చేసుకోవచ్చునని తెలిపారు. ముఖ్యంగా రోడ్డు భద్రతలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ఈ యాప్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు. ఇక పై నడిరోడ్డుపై ఆటోలు నిలపడం, ఓవర్ లోడ్, మద్యం తాగి వాహనాలు నడపడం వంటివి ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ (అడ్మినిస్ట్రేషన్) రాయల ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లు సుజాత, వెంకన్న, ట్రాఫిక్ సిబ్బంది, టాక్సీ, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులకు 40 శాతం లాభాల వాటా ఇవ్వాలి..

- రూ.59 వేల కోట్ల బకాయిలను వెంటనే రాబట్టాలి..
- ఏఐటీయూసీ డిమాండ్




**మణుగూరు, మహా** : సింగరేణి కార్మికులకు 2025 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల్లో 40 శాతం వాటాను వెంటనే ప్రకటించి చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. యూనియన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మణుగూరు ఏరియాలోని వివిధ గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద ఉన్నతాధికారులకు యూనియన్ నాయకులు మెమోరాండాలు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక లాభాలను ఇప్పటివరకు ప్రకటించకపోవడంతో కార్మికుల్లో ఆందోళన నెలకొందన్నారు. సంస్థ అభివృద్ధి, బొగ్గు ఉత్పత్తి, లాభాల సాధనలో కార్మికుల శ్రమ, అంకితభావమే కీలకమని పేర్కొన్నారు. కార్మికుల కృషితో వచ్చిన లాభాల్లో వారికి తగిన వాటా ఇవ్వడం యాజమాన్యం బాధ్యతని అన్నారు. గత సంప్రదాయం ప్రకారం గుర్తింపు పొందిన కార్మిక సంఘంతో చర్చించి, ముఖ్యమంత్రి సమక్షంలో కార్మికులకు 40 శాతం లాభాల వాటా ప్రకటించి తక్షణమే చెల్లించాలని కోరారు. సంస్థలో ఉత్పత్తికి, కార్మికుల రక్షణకు అవసరమైన మెటీరియల్, పరికరాల కొరత తీవ్రంగా ఉందని, కొనుగోళ్లకు నిధులు లేవని యాజమాన్యం చెప్పడం ఆందోళనకరమన్నారు. అవసరమైన రక్షణ పరికరాలు, ఉత్పత్తి సామగ్రిని వెంటనే అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితి కొనసాగితే అక్టోబర్‌లో కార్మికులకు చెల్లించాల్సిన దసరా అడ్వాన్స్, లాభాల వాటా, దీపావళి బోనస్ వంటి ఆర్థిక ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థ ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సింగరేణికి టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల నుంచి రావాల్సిన రూ.59 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా త్వరగా ఇప్పించేందుకు యాజమాన్యం ఉన్నతస్థాయిలో చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. లాభాల ప్రకటన, 40 శాతం వాటా చెల్లింపు, రక్షణ పరికరాలు, ఉత్పత్తి సామగ్రి సరఫరా, బకాయిల వసూళ్లపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, ఆఫీస్ బేరర్లు ఆవుల నాగరాజు, బి. సురేందర్‌రావు, ఫిట్ సెక్రటరీలు శనిగరపు కుమారస్వామి, బి. రవికుమార్, గుంపెనపల్లి శ్రీనివాసరావు, వి. సతీష్, సాయి ప్రకాష్ చారి, ఆంథోని రవికుమార్, ఎం. పద్మావతి, నాయకులు జానకి ప్రసాద్, రవిశంకర్, కళ్యాణం రవి, ఉడుత శివకుమార్, దండు విజయ్, ఎస్‌కే వలి, జగన్మోహన్, బి.వి. సత్యనారాయణ, బైరి వెంకటేశ్వర్లు, గొప్ప సుధాకర్, చొప్ప సుధాకర్, బ్రహ్మం, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి..

- ఎస్ఐఆర్‌లో అవకతవకలపై అఖిలపక్షాల ఆందోళన..
- మణుగూరులో భారీ నిరసన ర్యాలీ




**మణుగూరు, మహా** : ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఏఐసీసీ, ఇండియా కూటమి పిలుపు మేరకు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచనతో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం మణుగూరులో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మణుగూరు సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా అంబేడ్కర్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడ అఖిలపక్ష నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణపై ప్రజల్లో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ఎన్నికల సంఘం వ్యవహరించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుకు భంగం కలిగితే ప్రజాస్వామ్య వ్యవస్థకే నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పౌరుడికి స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్, సీపీఐ డివిజన్ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, సీపీఎం జిల్లా నాయకుడు నెల్లూరి నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి దొబ్బల వెంకటప్పయ్య, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు మధుసూదన్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు బోనగిరి శివసైదులు, సారపు రాంరెడ్డి, సీపీఐ జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మున్నా లక్ష్మీకుమారి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, మైనార్టీ అధ్యక్షుడు ఎండీ రహీమ్ పాషా, సర్పంచ్‌లు పాల్వంచ రాములు, కారం పూజిత, ఉపసర్పంచ్‌లు గాండ్ల సురేష్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా, మండల, పట్టణ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, ఐఎన్‌టీయూసీ నాయకులు, లారీ యూనియన్, బొగ్గు ముఠా కార్మికులు, గుమాస్తాల సంఘం ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# మరణించిన కుటుంబాలకు అండగా డాక్టర్ కాళీ ప్రసాద్ రావు

**పరకాల, మహా :** హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం దామెర మండలం కుగిల్వాయి గ్రామానికి చెందిన దేవి బోగాచార్యులు సతీమణి దేవి హేమలత అలాగే లింగం సారయ్య ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు వారి నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా లింగం సారయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చుక్క వనిత మహేందర్ మాజీ మండల అధ్యక్షులు జంగిలి నాగరాజు బూత్ అధ్యక్షులు పెరుగు స్పందన, కుమార్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# బల్దియా గ్రీవెన్స్ కు 81 ఫిర్యాదులు

- పరిష్కారాలు మాత్రం గోవిందా అంటున్న బాధితులు
- కమిషనర్ ఆదేశాలు బేఖాతర్ చేస్తున్న అధికారులు, సిబ్బంది

వరంగల్, కార్పొరేషన్ మహా : గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి (గ్రీవెన్స్) కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ వారం ఏకంగా 81 ఫిర్యాదులు వచ్చాయి. కానీ పరిష్కారాలు మాత్రం అంతంత మాత్రమేనని బాధితులు వాపోతున్నారు. కమిషనర్ ఆదేశాలను సైతం టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులు బేఖాతర్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సోమవారం జరిగిన బల్దియా గ్రీవెన్స్ కార్యక్రమంలో మొత్తం 81 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో అత్యధికంగా టౌన్‌ప్లానింగ్ కు 32, ఇంజినీరింగ్ కు 28, ఆరోగ్యం, పారిశుద్ధ్యానికి 9, రెవెన్యూ కు 9, నీటి సరఫరా పై 3 వినతులు అందాయి. కాగా టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల పైనే అత్యధిక ఫిర్యాదులు రావడం గమనార్హం. అయితే ఫిర్యాదులు తీసుకుంటున్నారే తప్ప, పరిష్కారంలో మాత్రం జాప్యం జరుగుతోందని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి మున్సిపాలిటీ లో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ చుట్టూ తిరుగుతున్నా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు.

దీనికి ప్రధాన కారణం కమిషనర్ ఆదేశాలను క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోకపోవడమేనని తెలుస్తోంది. గ్రీవెన్స్ లో కమిషనర్ స్వయంగా పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చినా, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులు ఫైల్స్ ను పక్కన పడేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలు, డ్రైనేజీ సమస్యలు, రోడ్ల గుంతలు, ఆస్తి పన్ను సమస్యలు, నల్లా కనెక్షన్ల జాప్యం పై వచ్చిన ఫిర్యాదుల పై కూడా అధికారులు స్పందించడం లేదని ప్రజలు మండి పడుతున్నారు. ఇప్పటికైనా బల్దియా కమిషనర్ స్పందించి, గ్రీవెన్స్ లో వచ్చిన ఫిర్యాదుల పై ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్యంగా ఆదేశాలను బేఖాతర్ చేస్తున్న అధికారులు సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మచ్చుకు కొన్ని ఉదాహరణలు.. పైడిపల్లి లక్ష్మీగణపతి కాలనీలో రూ.47 లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు పనులు ఏడాదిన్నరగా ప్రారంభం కాలేదని 3వ డివిజన్ వాసులు ఫిర్యాదు చేశారు. సుబేదారి లో ఎల్ఆర్ఎస్ ఫీజు రూ.24,398 చెల్లించినా, సంబంధం లేని సర్వే నంబర్ పై ఉన్న కోర్టు కేసును చూపి దరఖాస్తును నిలిపివేశారని ఎన్. నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

# ప్రజావాణికి ప్రజలు ఎందుకు రావడం లేదు...??? వారానికి దరఖాస్తులు ఒకటి రెండే..!!




**వలిగొండ అక్టోబర్ 5 మహా న్యూస్** : గ్రామాల్లో ప్రజలకు సమస్యలు లేవా? లేక వారి సమస్యలను ప్రజావాణి ద్వారా పరిష్కరించుకోవచ్చనే విషయం తెలియదా? మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి ఒకటిరెండు దరఖాస్తులు మాత్రమే రావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, పింఛన్లు, భూ సమస్యలు, పారిశుద్ధ్యం తదితర అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా.. వాటిని పరిష్కరించుకునేందుకు ప్రజావాణిని ఎందుకు వినియోగించుకోవడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రజావాణి జరుగుతున్న విషయం గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు తెలియజేస్తున్నారా? ప్రజావాణి ద్వారా దరఖాస్తు చేసుకుంటే సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటారనే నమ్మకం ప్రజల్లో కల్పిస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజలకు ప్రజావాణి ఒక మార్గంగా నిలవాల్సి ఉండగా, దాని గురించి గ్రామస్థాయిలో సరైన అవగాహన లేకపోవడం వల్లే దరఖాస్తుల సంఖ్య తక్కువగా ఉంటోందా? లేక ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులపై సరైన స్పందన లేకపోవడంతో ప్రజల్లో ఆసక్తి తగ్గిందా? అన్నది అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. ప్రజలకు తెలియజేయాల్సిన ప్రజావాణి.. ప్రజలకే ఎందుకు దూరమవుతోంది? ప్రతి గ్రామంలో ప్రజావాణి నిర్వహణ, దరఖాస్తు విధానం, సమస్యల పరిష్కార ప్రక్రియపై అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలని పలువురు ప్రజలు కోరుతున్నారు. ప్రజల సమస్యలు పరిష్కారమవుతున్నట్లు కనిపిస్తే మరింత మంది ప్రజలు ముందుకు వచ్చి దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

# రష్మిక సంప్రదాయంలో అందం అదుర్స్

హైదరాబాద్, మహా: నటి రష్మిక మందన్న మరోసారి తన అందం, అభినయంతో పాటు ఫ్యాషన్ సెన్స్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. తాజాగా ఆమె సంప్రదాయ చీరకట్టులో కనిపించిన ఫొటోలు సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సాధారణంగా మోడ్రన్ లుక్‌లో కనిపించే రష్మిక.. ఈసారి పూర్తిగా ట్రెడిషనల్ స్టైల్‌లో దర్శనమిచ్చి అభిమానులను ఫిదా చేశారు. మెరూన్ రంగు చీరలో రష్మిక ఎంతో అందంగా కనిపించారు. చీరకు తగ్గట్టుగా ఎంచుకున్న బ్లౌజ్, సంప్రదాయ డిజైన్‌తో కూడిన నగలు ఆమె లుక్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. ముఖ్యంగా టెంపుల్ జ్యువెలరీ తరహా ఆభరణాలు రష్మిక సంప్రదాయ రూపాన్ని మరింత అందంగా తీర్చిదిద్దాయి. చెవిపోగులు, హారం, ఇతర ఆభరణాలతో ఆమె అలంకరణ ఆకట్టుకునేలా ఉంది. చీరకట్టుకు తగ్గట్టుగా జుట్టును సింపుల్‌గా స్టైల్ చేసుకోవడంతో రష్మిక లుక్‌లో సహజత్వం కనిపించింది. మేకప్‌ను కూడా ఎక్కువగా హైలైట్ చేయకుండా సంప్రదాయ శైలికి సరిపోయేలా ఉంచారు. దీంతో ఆమె అందం మరింత సహజంగా కనిపించింది. కెమెరా ముందు రష్మిక ఇచ్చిన వివిధ పోజులు ఫొటోలకు అదనపు ఆకర్షణగా నిలిచాయి.ఈ ఫొటోలు సోషల్ మీడియాలోకి వచ్చిన వెంటనే అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. రష్మికను సంప్రదాయ దుస్తుల్లో చూడటం చాలా బాగుందని పలువురు కామెంట్లు చేస్తున్నారు. చీర, నగలు, హెయిర్ స్టైల్ కలయికలో ఆమె లుక్ చాలా క్లాసీగా ఉందంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. రష్మికకు సినిమా రంగంతో పాటు ఫ్యాషన్ ప్రపంచంలోనూ ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. ఆమె ధరించే దుస్తులు, ఎంచుకునే లుక్స్ తరచూ అభిమానులు, ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తుంటాయి. ముఖ్యంగా సంప్రదాయ దుస్తుల్లో ఆమె కనిపించినప్పుడల్లా సోషల్ మీడియాలో ఫొటోలు వైరల్‌గా మారుతుంటాయి. తాజాగా మెరూన్ చీరలో కనిపించిన ఈ లుక్ కూడా అదే తరహాలో అభిమానులను ఆకట్టుకుంటోంది. విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ కెరీర్‌లో ముందుకు సాగుతున్న రష్మిక.. ఇటు సినిమాలతో పాటు తన ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌తోనూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. తాజా సంప్రదాయ లుక్ అందుకు మరో ఉదాహరణగా నిలిచింది.





# ఆదర్శ కుటుంబం విడుదల వాయిదా

హైదరాబాద్, మహా: టాలీవుడ్‌లో ఆసక్తి రేపుతున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా విడుదలపై తాజాగా కీలక మార్పు చోటుచేసుకుంది. వెంకటేశ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ కాంబినేషన్‌పై ఉన్న క్రేజ్ కారణంగా సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్‌పై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే అనుకున్న సమయానికి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం సాధ్యం కాకపోవడంతో విడుదలను వాయిదా వేసినట్లు చిత్రబృందం వెల్లడించింది. సినిమా నిర్మాణానికి సంబంధించిన పనులు, ఇతర కార్యక్రమాలను పూర్తి స్థాయిలో సిద్ధం చేసిన తర్వాతే విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. తొందరపడి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం కంటే, కంటెంట్‌కు సరైన సమయం కేటాయించి విడుదల చేయడమే మంచిదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నిర్మాత నాగవంశీ కూడా సినిమా విడుదలపై స్పందించారు. సినిమాకు సంబంధించిన పనులు పూర్తయ్యే విధానం, విడుదలకు అనుకూలమైన పరిస్థితులను పరిశీలించిన తర్వాతే తుది తేదీని నిర్ణయించనున్నట్లు ఆయన వెల్లడించినట్లు సమాచారం. దీంతో 'ఆదర్శ కుటుంబం' కొత్త విడుదల తేదీపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. వెంకటేశ్-త్రివిక్రమ్ కాంబినేషన్ కావడంతో ఈ సినిమాపై సహజంగానే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాలు ప్రేక్షకులను అలరించడంతో ఈ ప్రాజెక్టుపై కూడా అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి కనిపిస్తోంది. కుటుంబ కథాంశానికి వినోదాన్ని జోడించే త్రివిక్రమ్ శైలిలో ఈ సినిమా ఉండబోతుందనే అంచనాలు ఉన్నాయి. విడుదల వాయిదా పడటంతో అభిమానుల్లో కొంత నిరాశ కనిపించినప్పటికీ, మంచి కంటెంట్‌తో సినిమా వస్తే ఎదురుచూడటానికి సిద్ధంగా ఉన్నామంటూ పలువురు సోషల్ మీడియాలో స్పందిస్తున్నారు. మరోవైపు కొత్త విడుదల తేదీపై చిత్రబృందం అధికారిక ప్రకటన కోసం ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు.సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు, కొత్త విడుదల తేదీ, ప్రచార కార్యక్రమాలపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అప్పటివరకు 'ఆదర్శ కుటుంబం'పై నెలకొన్న అంచనాలు మరింత పెరిగే అవకాశముంది.



# జపాన్‌లో నాగార్జునకు కొత్త క్రేజ్

హైదరాబాద్, మహా: అక్కినేని నాగార్జున నటించిన 'శివ' సినిమా మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంటోంది. 1989లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ యాక్షన్ చిత్రం అప్పట్లో తెలుగు సినిమా రూపురేఖలను మార్చిన చిత్రంగా నిలిచింది. రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇప్పటికీ ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన క్రేజ్‌ను కొనసాగిస్తోంది. తాజాగా జపాన్‌లో ప్రత్యేక ప్రదర్శనకు వచ్చిన 'శివ'కు అక్కడి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది.జపాన్ ప్రేక్షకులు నాగార్జున నటనను ప్రత్యేకంగా ప్రశంసిస్తున్నారు. ఆయనను అభిమానులు ప్రేమగా 'లార్డ్ నాగ్', 'నాగ్ సామా' అంటూ పిలుస్తుండటం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సినిమాను చూసిన పలువురు జపాన్ అభిమానులు నాగార్జున స్క్రీన్ ప్రెజెన్స్, ఆయన పాత్ర తీరు తమను ఆకట్టుకున్నాయని చెబుతున్నారు. దశాబ్దాల క్రితం వచ్చిన సినిమా అయినప్పటికీ ఇప్పటికీ కొత్తగా అనిపిస్తోందంటూ ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.'శివ'లో నాగార్జునకు జోడీగా అమల నటించారు. రఘువరన్ ప్రతినాయక పాత్రలో మెప్పించగా, ఇతర కీలక పాత్రల్లో పలువురు ప్రముఖ నటులు కనిపించారు. కాలేజీ నేపథ్యంలో సాగే కథలో విద్యార్థి రాజకీయాలు, గ్యాంగ్ కార్యకలాపాలు, అన్యాయాన్ని ఎదుర్కొనే యువకుడి పోరాటాన్ని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తనదైన శైలిలో తెరకెక్కించారు. ఇళయరాజా అందించిన సంగీతం కూడా సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఇక 'శివ'కు మరోసారి కొత్త హంగులు అద్దుతూ 4కే, డాల్బీ అట్మాస్ వెర్షన్‌లో రీరిలీజ్ చేయడం కూడా అభిమానులను ఆకట్టుకుంది. పాత సినిమాను ఆధునిక సాంకేతికతతో పెద్ద తెరపై చూసే అవకాశం రావడంతో అప్పటి ప్రేక్షకులతో పాటు కొత్త తరానికి చెందిన సినీ ప్రియులు కూడా ఈ చిత్రాన్ని ఆస్వాదించారు.జపాన్‌లో తాజాగా వచ్చిన స్పందనతో నాగార్జున అభిమానుల్లో మరింత ఉత్సాహం కనిపిస్తోంది. ఒక సినిమా ఎంత పాతదైనా కథ, పాత్రలు, నటన, సాంకేతిక విలువలు బలంగా ఉంటే కొత్త తరాల ప్రేక్షకులను కూడా ఆకట్టుకోగలదనే విషయాన్ని 'శివ' మరోసారి నిరూపించింది. ముఖ్యంగా భాషా సరిహద్దులు దాటి నాగార్జునకు లభిస్తున్న ఆదరణ టాలీవుడ్ అభిమానులను ఆనందానికి గురిచేస్తోంది. 'శివ'కు జపాన్‌లో దక్కుతున్న స్పందనతో నాగార్జున పాత సినిమాలపై అక్కడి ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి పెరిగే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. గతంలోనూ నాగార్జున సినిమాలకు జపాన్‌లో ప్రత్యేక అభిమాన వర్గం ఏర్పడింది. ఇప్పుడు 'శివ'కు లభిస్తున్న ఆదరణ ఆ క్రేజ్‌ను మరింత బలపరుస్తోంది.



# రామాయణం సెట్‌లో అగ్నిప్రమాదం

ముంబై, మహా: బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్, టాలీవుడ్ హీరోయిన్ సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణం' షూటింగ్ ప్రాంతంలో అగ్నిప్రమాదం కలకలం రేపింది. ముంబైలోని ఫిల్మ్ సిటీలో సోమవారం సాయంత్రం తాత్కాలిక షూటింగ్ నిర్మాణానికి సంబంధించిన ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో అక్కడున్నవారు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అధికారిక వివరాల ప్రకారం ఘటనలో ఎవరూ గాయపడలేదు. మంటలు ఎక్కువగా వ్యాపించకముందే అదుపులోకి రావడంతో భారీ ప్రమాదం తప్పినట్లు తెలుస్తోంది. తాత్కాలిక నిర్మాణంలో విద్యుత్ వైర్లు, కేబుల్స్, చెక్క సామగ్రి, ఏసీ యూనిట్లు, వెదురు, ప్లాస్టిక్ వస్తువులు, సౌండ్ పరికరాలు, షూటింగ్ సామగ్రి తదితరాలు ఉన్నట్లు సమాచారం.ఈ ఘటనపై ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్ (FWICE) అధ్యక్షుడు బి.ఎన్. తివారీ స్పందించారు. షూటింగ్ ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఇటీవల సమీప ప్రాంతంలోనూ అగ్నిప్రమాదం జరిగిన నేపథ్యంలో నిర్మాతలకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినప్పటికీ మరో ఘటన చోటుచేసుకోవడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. అయితే తాజా ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడం, నష్టం పరిమితంగానే ఉండటం ఊరటనిచ్చే విషయమన్నారు.ఇదిలా ఉండగా, 'రామాయణం' సినిమా షూటింగ్ ప్రాంతానికి సమీపంలో మరికొన్ని టీవీ కార్యక్రమాల చిత్రీకరణ కూడా జరుగుతున్నట్లు సమాచారం. ప్రమాదం నేపథ్యంలో కొంతసేపు షూటింగ్ కార్యకలాపాలను నిలిపివేసి పరిస్థితిని అదుపులోకి తీసుకున్న తర్వాత తిరిగి ప్రారంభించినట్లు నివేదికలు చెబుతున్నాయి. అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కొన్ని దృశ్యాల నేపథ్యంలో 'రామాయణం' అసలు ప్రధాన సెట్‌కే మంటలు అంటుకున్నాయా అనే విషయంలో భిన్న కథనాలు వెలువడ్డాయి. కొన్ని నివేదికలు మంటలు సినిమా షూటింగ్ ప్రాంతానికి సంబంధించిన తాత్కాలిక నిర్మాణంలో చోటుచేసుకున్నాయని చెబుతుండగా, మరికొన్ని కథనాలు ప్రధాన 'రామాయణం' సెట్‌కు ఈ ఘటనకు సంబంధం లేదని పేర్కొన్నాయి.నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రామాయణం'లో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, యశ్ రావణుడిగా కనిపించనున్నారు. సన్నీ డియోల్ హనుమంతుడి పాత్రలో నటిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ భారీ చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034